

APTEL/26/A4813

# శ్రీ వార్త

జాతీయ తెలుగు దినపత్రిక

కొత్త ఆలోచన.. కొత్త వార్త




సంపుటి : 01 సంచిక :50 ఎడిటర్.: కూరేటి సతీష్ పేజిలు : 08, వెల రూ. 2రూ/ శుక్రవారం - 28 - ఆగష్టు - 2026

Published From : Circulated at Srikakulam,VishakaPatanam,Vijayanagaram, East Godavari, West Godavari, Krishna, Guntur, Prakasam, Nellore, Chittoor,, Kadapa, Anantapuram, Hyderabad

## నేపాల్‌లో వరద విలయం.. 105 మంది భారతీయులు గల్లంతు

- టిబెన్ నుంచి వచ్చిన భారీ వరదలు నేపాల్‌లో పెను విలయాన్ని సృష్టించింది.
- భోటెకోషి నది ఉద్ధృతంగా ప్రవహించడంతో నువాకోట్, ధాదింగ్ జిల్లాల్లో భారీ నష్టం జరిగింది.ఇప్పటివరకు కనీసం 8 మృతదేహాలను గుర్తించినట్లు నేపాల్ అధికారులు తెలిపారు



టిబెన్ నుంచి వచ్చిన భారీ వరదలు నేపాల్‌లో పెను విలయాన్ని సృష్టించింది. భోటెకోషి నది ఉద్ధృతంగా ప్రవహించడంతో నువాకోట్, మిగతా 2లో

## భారత్ ధర్మశాల కాదు.. దేశ భద్రతపై అమిత్ షా కీలక వ్యాఖ్యలు

- 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌గా ఎదగాలంటే దేశ అంతర్గత భద్రత మరింత బలోపేతం కావాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు.
- అక్రమ చొరబాట్లు, ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ ముప్పులు వంటి సవాళ్లను ముందుగానే గుర్తించి అడ్డుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్‌గా ఎదగాలంటే దేశ అంతర్గత భద్రత మరింత బలోపేతం కావాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అక్రమ చొరబాట్లు, ఉగ్రవాదం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, సైబర్ ముప్పులు వంటి సవాళ్లను మిగతా 2లో



## అన్నపూర్ణ వంటి ఆంధ్రప్రదేశ్‌ను వైసీపీ పాలనలో 'అన్యమత ప్రదేశ్'గా మార్చారు



- వైసీపీ పాలనలో హిందూ ఆలయాలు, విగ్రహాలపై దాడులు జరిగాయన్న భానుప్రకాశ్ రెడ్డి
- సనాతన ధర్మాన్ని నాశనం చేసేందుకు ఎవరు యత్నించినా తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరిక
- విజయసాయి ఆరోజే సనాతన ధర్మం గురించి మాట్లాడి ఉంటే బాగుండేదని వ్యాఖ్య

వైసీపీ అధినేత జగన్ పై టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో, ధాన్యంతో అలరారే 'అన్నపూర్ణ' వంటి ఆంధ్రప్రదేశ్‌ను మిగతా 2లో

## ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలకు

# అత్యధిక ప్రాధాన్యం

### జనవరి 1 నుంచి సంజీవని సేవలు: సీఎం చంద్రబాబు

- మదర్ థెరిసా నిస్వార్థ సేవలను మననం చేసుకుందాం
- కుప్పం, చిత్తూరు ఫలితాలతో పక్కాగా కార్యాచరణ
- వైద్యారోగ్యం, సంజీవని ప్రాజెక్టులపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- 2027, జనవరి 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు.
- బుధవారం రాజధాని అమరావతిలో వైద్య ఆరోగ్య సేవలు, సంజీవని ప్రాజెక్ట్ సేవలపై ఆయన సమీక్షించారు. కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో అమలు చేసిన ప్రాజెక్ట్ ఫలితాలను ఆధారంగా చేసుకుని కార్యాచరణ రూపొందించాలని వారికి సీఎం సూచించారు



2027, జనవరి 1వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా సంజీవని సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. బుధవారం రాజధాని అమరావతిలో వైద్య ఆరోగ్య సేవలు, సంజీవని ప్రాజెక్ట్ సేవలపై మిగతా 2లో

## 'చంద్రబాబు సంపద సృష్టి అంటే ఇదేనా?'



- ఏపీలో మద్యం ఏరులై పారుతోందని టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు.
- ప్రీమియం లిక్కర్ బ్రాండ్‌లకు సైతం తలుపులు తెరిచి మరీ మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని మండిపడ్డారు.

తిరుపతి: ఏపీలో మద్యం ఏరులై పారుతోందని టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నేత భూమన కరుణాకర్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రీమియం లిక్కర్ బ్రాండ్‌లకు సైతం తలుపులు మిగతా 2లో

## తెలంగాణ వేదికగా 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'



- తెలంగాణకు అవకాశం ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేసిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- కేంద్ర క్రీడామంత్రిత్వ శాఖ సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- రూ.22 కోట్లు విడుదల చేసిన కేంద్ర ప్రభుత్వం

భారతదేశ యువశక్తికి సరైన క్రీడా సదుపాయాలను, అవసరమైన ప్రోత్సాహాన్ని కల్పించి.. వారిలోని శక్తిసామర్థ్యాలకు పదునుపెట్టడంతో పాటుగా వారికి క్రీడా రంగంలో ఉజ్వలమైన భవిష్యత్తును అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. అందుకోసం గత 12 ఏళ్లుగా వివిధ కార్యక్రమాలతోపాటు పథకాలను తీసుకొచ్చింది. 'ఖేలో ఇండియా' కార్యక్రమం ద్వారా.. దేశంలోని యువ క్రీడాశక్తిని ప్రోత్సహించేందుకు దేశవ్యాప్తంగా.. 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్', 'ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్', 'ఖేలో ఇండియా

## గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా

# చర్యలు తీసుకోండి

### ప్రమాద స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ

- సూర్యాపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.
- మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.
- గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును ఆదేశించారు.
- బుధవారం ఉదయం సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట సమీపంలో కంటైనర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన దుర్ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.
- కోదాడ బస్సు ప్రమాద స్థలాన్ని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ పరిశీలించారు.
- బస్సు డ్రైవర్ అతివేగం నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని వెల్లడించారు. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారని.. 12 మంది గాయపడ్డారని తెలిపారు.



సూర్యాపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజును ఆదేశించారు. బుధవారం ఉదయం సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట సమీపంలో కంటైనర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన దుర్ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు.సూర్యాపేట జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మిగతా 2లో

## గొడ్డలి పార్టీలో పాపం చేసిన వారెవ్వరూ శిక్షల నుంచి తప్పించుకోలేరు



- గొడ్డలి పార్టీలో పాపం చేసిన వారెవ్వరూ శిక్షల నుంచి తప్పించుకోలేరని ఆంధ్రప్రదేశ్ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు.
- ఎల్ నినోపై అసెంబ్లీలో చర్చ పెడితే ఇంట్లో పడుకున్న వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. ఇప్పుడు ప్రెస్ మీట్ పెట్టి అభూతకల్పనలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

గొడ్డలి పార్టీలో పాపం చేసిన వారెవ్వరూ శిక్షల నుంచి తప్పించుకోలేరని ఆంధ్రప్రదేశ్ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. బుధవారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. ఎల్ నినోపై అసెంబ్లీలో చర్చ పెడితే ఇంట్లో పడుకున్న వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్.. ఇప్పుడు ప్రెస్ మీట్ పెట్టి అభూతకల్పనలు మిగతా 2లో

## భయంకర కరవు పరిస్థితులు ఉన్నా చంద్రబాబు ప్రభుత్వం స్పందించడం లేదు

### తీవ్రకరువులో కుంభకర్ణుడి మాదిరిగా చంద్రబాబు తీరు

- డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని సవాల్ విసిరినా సమాధానం లేదన్న జగన్
- 28 జిల్లాల్లో తీవ్ర లోటు వర్షపాతం నమోదయిందని ఆందోళన
- చంద్రబాబు మాటలు నమ్మి రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన



కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ జరిపించాలని తమ పార్టీ విసిరిన సవాలుకు చంద్రబాబు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి సమాధానం లేదని ఆయన ఆరోపించారు. తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రవ్యాప్తంగా కరవు భయంకరమైన పరిస్థితులకు దారితీసిందని, మొత్తం 28 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైందని జగన్ ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమతో పాటు కోస్తా ప్రాంతంలోనూ మిగతా 2లో

## యువత ఆశలు, లక్ష్యాలను తెలుసుకోవడం నాయకులకు అవసరం



- జెన్ జీ యువతతో సమావేశాలు.. కోటంరెడ్డిపై నారా లోకేశ్ ప్రశంసలు
- ఈ ప్రమాదంలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలి
- యువతో జరిగే ఇలాంటి కార్యక్రమాల కోసం తాను కూడా ఎదురు చూస్తున్నానన్న మంత్రి
- లోకేశ్ ఆలోచనల నుంచే తాను ప్రేరణ పొందానన్న కోటంరెడ్డి

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి 'జెన్ జీ' యువతతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం పట్ల ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హర్షం మిగతా 2లో

## కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమంగా సాగితే.. రేవంత్ పాలన భూముల వ్యాపారంగా సాగుతోంది

### ప్రభుత్వమే కబ్జాదారుగా మారింది: హరీశ్‌రావు ఆగ్రహం

- కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందన్న హరీశ్
- పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను అమ్మేస్తున్నారని ఆరోపణ
- లక్షల ఎకరాల అసైన్డ్ భూములను లాక్కొంటున్నారని మండిపాటు



నాడు కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమ కేంద్రంగా సాగితే, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి పాలన భూముల వ్యాపారం కేంద్రంగా నడుస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ దెబ్బతింటోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోని కూకట్‌పల్లిలో మిగతా 2లో

# నేపాల్‌లో వరద విలయం.. 105 మంది భారతీయులు గల్లంతు

ధాడింగ్ జిల్లాల్లో భారీ నష్టం జరిగింది.ఇప్పటివరకు కనీసం 8 మృతదేహాలను గుర్తించినట్లు నేపాల్ అధికారులు తెలిపారు. గల్లంతైన వారిలో 105 మంది భారతీయులు ఉన్నట్లు నేపాల్ టూరిజం బోర్డు వెల్లడించింది.నేపాల్ టూరిజం బోర్డు చెప్పిన వివరాల ప్రకారం.. వరద ప్రభావిత ప్రాంతాల్లో మొత్తం 384 మది పర్యాటకులు గల్లంతైనట్లు సమాచారం. ఇందులో 291 మంది విదేశీయులు కాగా, 93 మంది నేపాల్ పౌరులు ఉన్నారు. గల్లంతైన విదేశీయుల్లో 105 మంది భారతీయలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. రసువా జిల్లాలో 26 మంది నేపాల్ పోలీస్ సిబ్బంది ఆచూకీ కూడా తెలియడం లేదని చెప్పారు. ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్‌కు చెందిన ఏడుగురు సిబ్బంది కూగా గల్లంతైన వారిలో ఉన్నారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో రెస్క్యూ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 20 మందిని రక్షించారు. రెస్క్యూ కోసం 15 హెలికాప్టర్లను ఉపయోగిస్తున్నారు. భారీ వరదల కారణంగా ఉత్తర నేపాల్ ప్రాంతం తీవ్రంగా దెబ్బతింది. ఆ ప్రాంతాల్లోని రోడ్లు, విద్యుత్ మౌలిక సదుపాయాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వరదల కారణంగా జల విద్యుత్ కేంద్రాలు దెబ్బతిన్నాయి. నేపాల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ప్రకారం రసువాగఢి, చిలిమే, త్రిశూలి 3ఏ, త్రిశూలి 3బీ హబ్ 220 కేవీ సబ్‌స్టేషన్, త్రిశూలి హైడ్రోపవర్ స్టేషన్, దేవీఘాట్ హైడ్రోపవర్ స్టేషన్ సహా కనీసం ఆరు ప్రధాన విద్యుత్ మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయి.

# భారత్ ధర్మశాల కాదు.. దేశ భద్రతపై అమిత్ షా కీలక వ్యాఖ్యలు

ముందుగానే గుర్తించి అడ్డుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇంటెలిజెన్స్ బ్యూరో నిర్వహించిన నేషనల్ సెక్యూరిటీ స్ట్రాటజీ కాన్ఫరెన్స్ ముగింపు సమావేశంలో అమిత్ షా పాల్గొన్నారు.ఆ సమావేశంలో అమిత్ షా భవిష్యత్ భద్రతా వ్యూహంపై కీలక సూచనలు చేశారు. వచ్చే 15-20 ఏళ్లలో దేశ భద్రతను ప్రభావితం చేసే పరిణామాలను ఇప్పటి నుంచే అంచనా వేసి వ్యూహాలను రూపొందించాలని భద్రతా, నిఘా సంస్థలను కోరారు. అక్రమ వలసదారుల అంశంపై అమిత్ షా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'ఈ దేశం ధర్మశాల కాదు. ఈ దేశంలో నివసించే హక్కు కేవలం ఈ దేశ పౌరులకు మాత్రమే ఉంటుంది' అని అన్నారు. అక్రమ చొరబాట్లు దేశ భద్రతతో పాటు ఆర్థిక స్థిరత్వం, జనాభా సమతుల్యతకు కూడా ముప్పుగా మారే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు భద్రతా వ్యవస్థలు అక్రమ చొరబాట్లను ముందుగానే గుర్తించి అడ్డుకోవాలని సూచించారు దేశంలోని భూ సరిహద్దుల భద్రతను మరింత పటిష్ఠం చేసేందుకు కేంద్రం చర్యలు చేపట్టిందని హోంమంత్రి తెలిపారు. గత ఎనిమిది నెలల్లో సరిహద్దుల్లో ఉన్న అన్ని రాష్ట్రాలతో కేంద్రం చర్చలు జరిపిందని, నాలుగు స్తంభాల సరిహద్దు భద్రతా వ్యవస్థను రూపొందించినట్లు చెప్పారు. తక్కువ సమయంలో భారత్‌ను అక్రమ చొరబాట్ల నుంచి విముక్తి చేయడమే లక్ష్యమని అమిత్ షా పేర్కొన్నారు.

# తెలంగాణ వేదికగా 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్'

'ఖేలో ఇండియా బీచ్ గేమ్స్', 'ఖేలో ఇండియా వాటర్ స్పోర్ట్స్ ఫెస్టివల్', 'ఖేలో ఇండియా ట్రైబల్ గేమ్స్' వంటి క్రీడా పోటీల నిర్వహణ ద్వారా క్రీడాకారులు తమలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను, తమలోని నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి ఒక వేదికను ఏర్పాటు చేసింది.ఇప్పటి వరకు జరిగిన 24 ఎడిషన్ల 'ఖేలో ఇండియా ' పోటీల్లో దేశం నలుమూలల నుంచి 60 వేల మందికిపైగా క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ పరంపరలో భాగంగా.. ఈ ఏడాది జరగనున్న 8వ ఎడిషన్ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' ను తెలంగాణలో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది.హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్ వేదికగా ఈ పోటీలను నిర్వహించనున్నారు. ఈ ఎడిషన్‌లో మొత్తం 25 క్రీడల్లో పోటీలు నిర్వహించనున్నారు. ఆతిథ్య రాష్ట్రమైన తెలంగాణ.. ఒక స్థానిక క్రీడను ప్రతిపాదించవచ్చు. దీంతో పాటుగా మరో కొత్త క్రీడను కూడా ఈ ఈవెంట్లో ఆడించనున్నారు. ఈ పోటీల్లో దేశవ్యాప్తంగా 6వేల మంది క్రీడాకారులు పాల్గొంటారని అంచనా.ఈ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్' నిర్వహణకోసం.. కేంద్ర ప్రభుత్వం రూ.22 కోట్లను విడుదల చేసింది. ఈ క్రీడా పోటీలను రాష్ట్ర ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్), నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ (ఎన్ఎస్ఎఫ్), స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా , సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్, ఖేలో ఇండియా పథకం అడ్‌హక్ కమిటీ, స్టీరింగ్ కమిటీల సంయుక్త నిర్వహణలో నిర్వహించనున్నారు.ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను తెలంగాణకు కేటాయించడం పట్ల.. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి, కేంద్ర యువజన సర్వీసులు, క్రీడా శాఖల మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు ధన్యవాదాలు తెలియజేశారు. స్పోర్ట్స్ బడ్జెట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేశాయని ఆరోపించారు. 2014లో కేంద్రంలో మోదీ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత.. స్పోర్ట్స్ బడ్జెట్ కేటాయింపులు పెరిగాయని, ఖేలో ఇండియా వంటి పథకాల ద్వారా దేశంలోని మారుమూల ప్రాంతాలలో ఉన్న క్రీడా ప్రతిభకు సరైన ప్రోత్సాహం లభిస్తోందని పేర్కొన్నారు.'ఖేలో ఇండియా' స్కీమ్‌లో భాగంగా.. తెలంగాణలో కూడా దాదాపు రూ.30 కోట్లతో క్రీడా సదుపాయాల కల్పన జరిగిందని, అందులో రూ.11.5 కోట్లతో ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో సింథటిక్ ట్రాక్, సింథటిక్ టెన్నిస్ కోర్ట్, మహిళల కోసం ప్రత్యేక స్విమ్మింగ్ పూల్ వంటి సౌకర్యాలను కల్పించారని, మరో రూ.18.5 కోట్లతో రాష్ట్రంలోని వివిధ పట్టణాలలో క్రీడా సదుపాయాలను కల్పించారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఖేలో ఇండియా స్కీమ్, టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్), అసిస్టెన్స్ టు నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్(ఎన్ఎస్ఎఫ్), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) స్కీమ్ వంటి పథకాలు క్షేత్రస్థాయిలో మంచి ఫలితాలనిస్తున్నాయి. తెలంగాణకు చెందిన అంతర్జాతీయ బాక్సర్ నిఖత్ జరీన్.. టాప్స్ ప్రోగ్రామ్ సహాయంతో ఇవాళ భారతదేశ కీర్తిపతాకను రెపరెపలాడిస్తోంది. ఈ పథకం ద్వారా ఆమెకు అత్యాధునిక శిక్షణతోపాటుగా అంతర్జాతీయ ఈవెంట్లలో పాల్గొని అనుభవం గడించేందుకు ప్రోత్సాహం లభించింది..

# గొడ్డలి పార్టీలో పాపం చేసిన వారెవ్వరూ శిక్షల నుంచి తప్పించుకోలేరు

మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జగన్ ఐదేళ్ల పాలన దుర్మార్గాలు.. అసెంబ్లీ వేదికగా బయటపడతాయనే సభకు రాకుండా ఇంటికి పరిమిత మవుతున్నారంటూ వైసీపీ అధినేతపై నిప్పులు చెరిగారు.తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ మెప్పు కోసం రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెట్టిన దుర్మార్గుడు జగన్ రెడ్డి అని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. జగన్ దోపిడీ, ధన దాహానికి ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ విధ్వంసానికి గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టిసీమ పంపులు కాటాకు వేయాలని నాడు జగన్ మాట్లాడ లేదా? అని ప్రశ్నించారు. అదే పట్టిసీమ ప్రాజెక్టు ఎల్ నినో పరిస్థితుల్లో ఆదుకుంటోందని గుర్తు చేశారు.సీఎం చంద్రబాబు ముందు చూపు కారణంగా జలాశయాల్లో నీటిని నిల్వ చేయటం వల్ల క్లిష్ట పరిస్థితుల్ని సైతం ఎదుర్కోగలుగుతున్నామని చెప్పారు. జలవనరులపై జగన్ రెడ్డివి అవగాహన లేమి మాటలని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. రాయలసీమకు ద్రోహం చేసి ఇప్పుడు కపట ప్రేమ నటిస్తున్నారంటూ వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ రెడ్డి తీరును ఎండగట్టారు. తన రాజకీయ స్వార్థం కోసం 102 టెండర్లను రాయలసీమలో జగన్ రెడ్డి రద్దు చేశాడని మంత్రి కొల్లు రవీంద్ర వివరించారు.జగన్ నిర్లక్ష్యం కారణంగానే పోలవరం నిర్మాణ ఖర్చు పెరిగిందని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని తట్టుకో లేకే జగన్ వరుస ప్రెస్ మీట్లు పెడుతున్నాడని తెలిపారు.

# అన్నపూర్ణ వంటి ఆంధ్రప్రదేశ్‌ను వైసీపీ పాలనలో 'అన్యమత ప్రదేశ్'గా మార్చారు

'అన్యమత ప్రదేశ్'గా మార్చివేశారంటూ జగన్‌పై దుయ్యబట్టారు. గత ప్రభుత్వ హయాంలో హిందూ దేవాలయాలు, దేవతామూర్తుల విగ్రహాలపై దాడులు జరిగాయని, విగ్రహాల చేతులను సైతం ఖండించిన ఘటనలు చోటుచేసుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సనాతన ధర్మాన్ని నాశనం చేయడానికి ఎవరు ప్రయత్నించినా రాబోయే రోజుల్లో తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. సనాతన ధర్మానికి ఎలాంటి హాని కలగకుండా కాపాడేందుకు బీజేపీ కంకణబద్ధమై ఉందన్నారు. విజయసాయిరెడ్డి ఆరోజే సనాతన ధర్మం గురించి మాట్లాడి ఉంటే బాగుండేదని వ్యాఖ్యానించారు. వైసీపీలో ఉన్నప్పుడు కాకుండా, బయటకు వచ్చాక మాట్లాడితే దాని విలువ తగ్గుతుందని అన్నారు.అలాగే, కాకినాడలో చోటుచేసుకున్న సౌజన్య 'లవ్ జిహాద్' ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిందని... దేశంలో వేలాది మంది యువతులు ఈ నెట్‌వర్క్‌కు బలైపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుర్మార్గానికి ఒడిగట్టిన సాదిక్ లాంటి వ్యక్తుల వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకి విజ్ఞప్తి చేశారు. బాధితులు ధైర్యంగా ఫిర్యాదు చేసేందుకు వీలుగా 'టోల్ ఫ్రీ' నంబర్‌తో పాటు పోలీసు రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని... దీనిపై ఏపీ డీజీపీ ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

# 'చంద్రబాబు సంపద సృష్టి అంటే ఇదేనా?'

తెరిచి మరీ మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పెద్దలు ఆదాయం పెంచుకునేందుకు ఈ ప్లాన్ చేశారన్నారు. చంద్రబాబు సంపద సృష్టి అంటే ఇదేనా? అని ప్రశ్నించారు భూమన. 'మద్యం సవరణలు చేస్తూ ఏపీ ప్రభుత్వం జీవో తీసుకొచ్చింది. 5వేలకు పైబడిన మద్యానికి అనుమతులు ఇస్తూ ప్రభుత్వం జీవో 535 తీసుకు వచ్చింది. ప్రీమియర్ లిక్కర్‌కు బార్లా తలుపు తెరిచింది. ప్రతి చోట మద్యం దుకాణాలు.. ఊరూ-వాడ తేడా లేకుండా బెల్ట్ షాపులు విక్రయాలు సాగిస్తున్నారు. పగలు రాత్రి అని తేడా లేకుండా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రజల రోగ్యం పూర్తిగా గాలికి వదిలి వేసింది. రాష్ట్రంలో 3లక్షలకు పైగా బెల్ట్ షాపులు విళయ తాండవం చేస్తున్నాయి. మద్యం తాగాలి.. తూగాలి అనే నినాదం తో వెళ్తోంది కూటమి ప్రభుత్వం. ఖరీదైన మద్యం అమ్మకాలు ద్వారా ఆదాయం పెంచుకోవాలని చూస్తోంది. రూ. 20 లక్షల కోట్లు పరిశ్రమలు వచ్చాయని ఉదరకొడుతున్నారు.. అది ఇదేనా.?' అని నిలదీశారు.

# గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోండి

కోదాడ మండలం ద్వారకుంట దగ్గర కంటైనర్‌ను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొట్టిన విషయం తెలిసిందే. మృతుల కుటుంబాలకు సీఎం ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ సీఎస్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.ఈ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదంపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.కోదాడ మండలం దోరకుంట సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు.కోదాడ బస్సు ప్రమాద స్థలాన్ని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ కె. నరసింహ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడారు. బస్సు డ్రైవర్ అతివేగం నిర్లక్ష్యంతోనే ప్రమాదం జరిగిందని వెల్లడించారు. ఈ ఘటనలో ఆరుగురు మృతి చెందారని.. 12 మంది గాయపడ్డారని తెలిపారు. క్షతగాత్రులను ఖమ్మం, విజయవాడ, కోదాడ ఆస్పత్రులకు తరలించామని ఎస్పీ నరసింహ పేర్కొన్నారు.

మంత్రుల సంతాపం

సూర్యాపేట బస్సు ప్రమాద ఘటనపై మంత్రులు దామోదర్ రాజనర్సింహ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, కొండా సురేఖ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు. మృతదేహాలకు త్వరగా పోస్టుమార్టం నిర్వహించాలని అధికారులను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. పోస్టుమార్టం కోసం రెండు బృందాల ఏర్పాటు చేయాలని, మృతదేహాలను కుటుంబ సభ్యులకు త్వరగా అప్పగించాలని సూచించారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి, తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కూడా ప్రమాదంపై దిగ్భ్రాంతి తెలిపారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

సూర్యాపేట రోడ్డు ప్రమాదంపై బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో ఆరుగురు ప్రయాణికులు మృతి చెందడం అత్యంత బాధాకరమని అన్నారు. కోదాడ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు ప్రభుత్వం తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారు త్వరగా పూర్తిస్థాయిలో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఊహించని ఈ ప్రమాదంలో ఆత్మీయులను కోల్పోయి శోకసంద్రంలో ఉన్న బాధిత కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

ఘటనా స్థలంలో కలెక్టర్

కోదాడ మండలం ద్వారకుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పరిశీలించారు. ప్రమాద వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలను పర్యవేక్షించారు. ప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య పరామర్శించారు.

డ్రైవర్ మారిన మరుక్షణమే..

తాను డ్యూటీ మారిన తర్వాతనే ప్రమాదం జరిగిందని రెండో డ్రైవర్ మీడియాతో చెప్పారు. సూర్యాపేటలో తాను డ్రైవింగ్‌ను మరో డ్రైవర్‌కు అప్పగించి, పడుకున్నానని వెల్లడించారు. తర్వాత కొద్దిసేపటికే ప్రమాదం సంభవించిందని తెలిపారు. బస్సులో 42 మంది ఉన్నారని చెప్పారు.వెనుక సీటులో కూర్చోవడం వల్ల ప్రమాదం నుంచి కొద్దిలో ప్రాణాలతో బయటపడ్డానని ఓ ప్రయాణికుడు తెలిపారు. రాఖీ పండుగ కోసం చెల్లెలు దగ్గరికి వెళు తుండగా ప్రమాదం బారిన పడ్డానని చెప్పారు. ఇనుప రాడ్ తన ముఖం వరకు వచ్చి ఆగడంతో బతికిపోయానని వెల్లడించారు. బస్సు సూర్యాపేటలో ఆగి.. మళ్లీ స్టార్ట్ అయిన 15 నిమిషాల్లోనే ఈ యాక్సిడెంట్ జరిగిందని తెలిపారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం ద్వారకుంట సమీపంలో బుధవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకొని ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. అలాగే మరో 20 మందికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తుండగా, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. కాగా ఈ ఘోర రోడ్డు ప్రమాదంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలకు అత్యధిక ప్రాధాన్యం

ఆయన సమీక్షించారు. కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో అమలు చేసిన ప్రాజెక్ట్ ఫలితాలను ఆధారంగా చేసుకుని కార్యాచరణ రూపొందించాలని వారికి సీఎం సూచించారు .ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏఐ ఆధారిత ఆరోగ్య సేవలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి వీర పాండ్యన్‌తోపాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. పేదలు, అనాథల సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మానవతావాది, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మథర్ థెరిసా జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు. ప్రేమారాహిత్యంతో బాధపడుతున్న వారిని మదర్ థెరిసా అక్కున్న చేర్చుకున్నారని తెలిపారు. ఆమె నిస్వార్థ సేవలను స్మరించుకుందాం అంటూ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు తెలియజేశారు.'సాటిమనిషిలోని బాధను తొలగించడమే దైవత్వం. పేదరికం, ప్రేమారాహి త్యంతో బాధపడుతున్న నిస్సహాయులను అక్కున చేర్చుకుని ప్రేమను పంచి, సపర్యలు చేశారు మదర్ థెరిసా. ఈరోజు ఆ మహనీయురాలి జయంతి సందర్భంగా విశ్వవ్యాప్తమైన ఆమె నిస్వార్థ సేవలను, దివ్య చరితను మననం చేసుకుందాం' అంటూ ఎక్స్‌లో ముఖ్యమంత్రి పోస్ట్ చేశారు.మదర్ థెరిసా జయంతి సందర్భంగా విశాఖలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నివాళులర్పించారు. మదర్ థెరిసా చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. పేదలు, అనాథలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ప్రేమ, కరుణతో సేవలందించిన మదర్ థెరిసా జీవితం మానవతా విలువలకు ప్రతీక అని తెలిపారు. సేవే పరమావధిగా, మానవత్వమే మార్గంగా ఆమె అందించిన సేవలు ప్రపంచానికి స్ఫూర్తిదాయకమన్నారు. మదర్ థెరిసా ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజంలోని పేదలు, నిరుపేదలకు అండగా నిలవాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.వైద్యారోగ్య సేవలు మరింత మెరుగ్గా అందించేం దుకు చేపట్టిన 'సంజీవని ప్రాజెక్టు'ను జనవరి 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. డిజిటల్ హెల్త్ రికార్డులతో సంజీవని ప్రాజెక్టు పూర్తి స్థాయిలో అమలైతే వైద్య సేవల్లో అనూహ్య మార్పులు సాధించవచ్చన్నారు. వైద్య సేవల్లో ఏపీని ఇతర రాష్ట్రాలు అనుసరించేలా 'సంజీవని ప్రాజెక్టును విజయవంతం చేయాలని సీఎం సూచించారు. క్యాంపు కార్యాలయంలో బుధవారం 'సంజీవని ప్రాజెక్ట్'పై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. కుప్పం నియోజకవర్గం, చిత్తూరు జిల్లాల్లో ఇప్పటికే సంజీవని ప్రాజెక్ట్ అమలుతో ఉత్తమ ఫలితాలు వస్తున్నాయని, వీటిని రాష్ట్రమంతటా అమలు చేసేలా చూడాలన్నారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబం విద్యకు, వైద్యానికే అత్యధికంగా ఖర్చు పెట్టాల్సి వస్తోందని... ఈ వ్యయాన్ని తగ్గించేలా చూసేందుకు సంజీవని వంటి కార్యక్రమాలను తీసుకువస్తున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. సంజీవని ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా ఉన్న టాటా ఎండీ సంస్థ వైద్యారోగ్య రంగంలో సరికొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని నిర్దేశించారు. సంజీవని కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల ప్రణాళిక సిద్ధం చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. బేస్‌లైన్ అధ్యయనం, డిజిటల్ మౌలిక వసతుల ఏర్పాటు, శిక్షణ, సర్టిఫికేషన్, జాతీయ, రాష్ట్ర పోర్టల్స్‌తో ఇంటిగ్రేషన్ వంటి చర్యలు 90 రోజుల ప్రణాళికలో ఉన్నాయని వెల్లడించారు. 28 జిల్లాల్లో వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు.

డేటా గోప్యత, భద్రతకు ప్రాధాన్యం

సమీక్షలో సీఎం మాట్లాడుతూ...'ప్రిడెక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్ ఎఫెక్టివ్‌గా వైద్యసేవలు అందించాలి. వైద్య సేవలు అందించడంతో పాటు ఆహారపు అలవాట్లు, ఆలోచనా విధానం మారేలా చూడాలి. హోమియోపతి, ఆయుర్వేద, యోగా, ప్రాణాయామం, ఇంకా అత్యాధునిక వైద్య విజ్ఞానాన్ని వినియోగించు కోవాలి. ఏఐ డాక్టర్ కూడా విస్తృతంగా వినియోగంలోకి తీసుకురావాలి. డేటాను భద్రపరచడం, గోప్యంగా ఉంచడంతో పాటు... డ్యాష్ బోర్డు సిద్ధం చేయాలి. ఆస్పత్రుల్లో శానిటేషన్ సహా వివిధ ఔట్ సోర్సింగ్ సేవల విషయంలో దృష్టి పెట్టాలి. సమర్ధవంతంగా వైద్య సేవలు అందించని ఔట్ సోర్సింగ్ సర్వీస్ ప్రొవైడర్లను తొలగించేలా ఒక విధానం తీసుకురావాలి. విశ్వాసం పెంచేలా వైద్య సేవలు ఉండాలి. ప్రజల మొబైళ్లకు నేరుగా హెల్త్ అప్డేట్స్ పంపించేలా వ్యవస్థను తీర్చిదిద్దాలి.' అని చెప్పారు.

వ్యాధుల నియంత్రణకు దోహదం

కుప్పం, చిత్తూరు ప్రాంతాల్లో సంజీవని కార్యక్రమం అమలుతో వచ్చిన ఫలితాలను సమీక్షలో ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రాజెక్టు అమలుతో మెరుగైన ఫలితాలు సాధిస్తున్నట్టు అధికారులు వివరించారు. చిత్తూరులో నమోదైన ఫలితాల ప్రకారం... హైపర్‌టెన్షన్ కేసుల్లో 56 శాతం కేసులు నియంత్రణలోకి వచ్చినట్టు తేలిందన్నారు. డయాబెటిస్ కేసుల్లో 16 శాతం కేసుల తీవ్రత తగ్గిందన్నారు. అలాగే, ప్రైమరీ హెల్త్‌కేర్ సేవల వినియోగంలోనూ గణనీయమైన పెరుగుదల నమోదైనట్టు వెల్లడించారు. సంజీవని సేవలపై పౌరుల అభిప్రాయాలను తెలుసుకునేందుకు నిర్వహించిన సర్వేలో 91 శాతం మంది సంజీవని సేవల అనంతరం తమ ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని చెప్పారు. స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలోఅప్ వరకు ఏఐ ఆధారిత ఆరోగ్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. సమీక్షలో మంత్రి సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి వీరపాండియన్, సంయుక్త కార్యదర్శి రోణంకి గోపాలకృష్ణ, టాటా ఎండీ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ నెల 31న వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు తెలిపారు.

# భయంకర కరవు పరిస్థితులు ఉన్నా చంద్రబాబు ప్రభుత్వం స్పందించడం లేదు

తీవ్రమైన అభద్రతా వాతావరణం నెలకొన్నా చంద్రబాబు ప్రభుత్వం స్పందించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని మండిపడ్డారు. జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో కేవలం 52 శాతం వర్షపాతం మాత్రమే నమోదైందని, మొత్తం 688 మండలాలకు గానూ 625 మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం ఉందని వివరించారు. ఎల్‌నినో ప్రభావం వల్ల జూన్, జులై నెలల్లో తక్కువ వర్షాలు పడతాయని తెలిసినప్పటికీ... పంటలకు నీళ్లిస్తామని ప్రభుత్వం ఆర్భాటం చేసిందని, వారి మాటలను నమ్మి ఎకరాకు రూ.15 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ఒకవైపు వర్షాలు లేక రైతాంగం సంక్షోభంలో కూరుకుపోతుంటే, నీటి విడుదల విషయంలో చంద్రబాబు ఏమాత్రం మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యంగా రాయలసీమ ప్రాజెక్టుల పట్ల కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. శ్రీశైలం జలాశయంలో ఉన్న నీటిని కరవుతో అల్లాడుతున్న రైతులకు అందించాల్సింది పోయి... తెలంగాణతో పోటీపడి విద్యుత్ ఉత్పత్తి కోసమే వినియోగించడం దారుణమన్నారు. అవకాశమున్నా పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు నీటిని విడుదల చేయడానికి చంద్రబాబుకు మనసు ఒప్పలేదని విమర్శించారు. సెప్టెంబర్ 15 తర్వాత వర్షాలు తగ్గుముఖం పడతాయని వాతావరణ శాఖ చెబుతున్న నేపథ్యంలో, రానున్న రోజుల్లో రాయలసీమకు నీరు ఎలా ఇస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని నిలదీశారు.మిలాద్-ఉన్-నబీ. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా..'ప్రేమతో మనసులు గెలవాలనీ.. కరుణతో కష్టాల్లో ఉన్నవారికి అండగా నిలవాలనీ.. క్షమ, సహనం, సోదరభావాలతో శాంతియుత సమాజాన్ని నిర్మించాలనీ.. మహ్మద్ ప్రవక్త మానవాళికి అందించిన సందేశం సదా అనుసరణీయం. మహ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్-ఉన్-నబీ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు' అని పోస్టు చేశారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ సవాల్ విసిరితే ఇప్పటిదాకా చంద్రబాబు ప్రభుత్వం నుంచి సమాధానమే రాలేదని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అంటున్నారు. రాష్ట్రంలో నెలకొన్న దారుణ పరిస్థితులపై బుధవారం ఆయన తాడేపల్లిలో మీడియా ద్వారా మాట్లాడారు. "రాష్ట్రంలో కరువు తీవ్రంగా ఉంది. మొత్తం 28 జిల్లాల్లో లోటు వర్షపాతం నమోదైంది. రాయలసీమతో పాటు కోస్తాలోనూ తీవ్ర కరువు నెలకొంది. అంత తీవ్ర పరిస్థితులు ఉన్నా చంద్రబాబు స్పందించడం లేదు. పైగా కుంభకర్ణుడిలా నిద్ర నటిస్తున్నారు. జూన్ నుంచి ఇప్పటిదాకా 52 శాతం వర్షపాతం నమోదైంది. మొత్తం 688 మండలాల్లో 625 మండలాల్లో లోటు వర్షపాతం ఉంది. అయినా రైతులను ఆదుకునే చర్యలేవీ చేపట్టలేదు..ఎల్‌నినో ఎఫెక్ట్ ఉంది అని తెలుసు. జూన్‌లో తక్కువ వర్షాలు పడ్డాయని తెలుసు. జులైలోనూ అదే పరిస్థితి. అయినా పంటలకు నీళ్లు ఇస్తామని ఫోజులు ఇచ్చారు. వీళ్లు నీళ్లు ఇస్తారనే నమ్మకంతో రైతులు పెట్టుబడులు పెట్టారు. ఫలితంగా.. ఎకరాకు 15 వేలు నష్టపోయారు. కరువు డేంజర్ బెల్స్ మోగుతున్న చంద్రబాబు కనీసం స్పందించడం లేదు అని వైఎస్ జగన్ అన్నారు.ఒకవైపు వర్షాలు లేక సంక్షోభం వస్తే మరోవైపు నీటిని విడుదల విషయంలో చంద్రబాబు మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నారని వైఎస్ జగన్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# కేసీఆర్ పాలన ప్రజా సంక్షేమంగా సాగితే.. రేవంత్ పాలన భూముల వ్యాపారంగా సాగుతోంది

ఏర్పాటు చేసిన 22ఏ బాధితుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో ఎక్కడ పార్కులు, ప్లాట్లు, ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే అక్కడ భూములను విక్రయిస్తూ భావి తరాలకు కనీసం స్థలం కూడా లేకుండా చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. సామాన్య ప్రజల ఆస్తులనేమో 22ఏ నిషేధిత జాబితాలోకి నెడుతూ, ప్రభుత్వ భూములను మాత్రం ముఖ్యమంత్రి సోదరుల చేతుల్లోకి వెళ్లేలా చేస్తున్నారని విమర్శించారు. లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములను పేదల వద్ద నుంచి లాక్కొని, కమీషన్ల కోసం పారిశ్రామికవేత్తలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. ఎప్పుడు 'హైడ్రా' వచ్చి ఇళ్లను కూలుస్తుందో, ఎప్పుడు 22ఏ పేరుతో తమ భూములను గుంజుకుంటారోనని ప్రజలు భయాందోళనలతో బతుకుతున్నారని తెలిపారురాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటి ఎకరాలను, ఒక్క హైదరాబాద్‌లోనే లక్షలాది ఆస్తులను రేవంత్ ప్రభుత్వం 22ఏ జాబితాలో చేర్చిందని ఆరోపించారు. ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలను ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిప్పుతూ... జాబితా నుంచి భూములను తొలగించడానికి 30 శాతం వరకు కమీషన్లు వసూలు చేస్తున్నారని విమర్శించారు. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఈ 22ఏ అంశంపై ప్రభుత్వాన్ని తీవ్రంగా నిలదీస్తామని స్పష్టం చేశారు. బాధితులు ఎవరూ బ్రోకర్లకు ఒక్క రూపాయి కూడా ఇవ్వొద్దని, ప్రజల ఆస్తులను కాపాడే బాధ్యతను బీఆర్ఎస్ పూర్తిగా తీసుకుంటుందని హామీ ఇచ్చారు.ప్రజల ఆస్తులను నిషేధిత జాబితా (22ఏ)లోకి చేర్చి, ప్రభుత్వమే పెద్ద కబ్జాదారులా మారిందని మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. కూకట్‌పల్లిలో 22ఏ బాధితుల సమస్యలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కేసీఆర్ ప్రజల సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పాలన సాగిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం భూముల కేంద్రంగానే వ్యవహారాలు నడుపుతోందని మండిపడ్డారు.కేసీఆర్ సీఎం కాగానే తాగునీరు, నగర ట్రాఫిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించారని, ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా వరి సాగులో పంజాబ్‌ను దాటి తెలంగాణను అగ్రస్థానంలో నిలిపారని అన్నారు. ఆయన ప్రతి నిర్ణయం పేదల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకునే తీసుకున్నారని చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడ విలువైన భూమి కనిపించినా అమ్మకానికి పెడుతోందని తీవ్రంగా ఆరోపించారు. ఇప్పటికే రెండున్నరేళ్లలో రూ.30 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను విక్రయించారని, భవిష్యత్ అవసరాలకు కూడా భూములు మిగల్చడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు సామాన్యుల భూములను 22ఏ జాబితాలో చేర్చి ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ప్రజల నుంచి భూములను గుంజుకుని తమ అనుచరులకు కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కుత్బు ల్లాపూర్‌లో అకారణంగా 22-ఏ నిషేధిత జాబితాలోచేర్చిన భూములను వెంటనే తొలగించాలని మాజీమంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. షాద్‌నగర్‌లో నిర్వహించిన 22-ఎ బాధితుల ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్లు, రుణాలు అందక వేలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అక్రమాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, బాధ్యుడైన మంత్రిని బర్తరఫ్ చేయాలని కోరారు. సెప్టెంబర్ 7 లోగా సమస్య పరిష్కారం కాకపోతే లక్షలాది మందితో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. బాధితులకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు.

# యువత ఆశలు, లక్ష్యాలను తెలుసుకోవడం నాయకులకు అవసరం

వ్యక్తం చేశారు. తర్వాతి తరం ఆలోచనలను అర్థం చేసుకోవడానికి ఈ కార్యక్రమం ఒక అద్భుతమైన చొరవ అని ఆయన కొనియాడారు.ప్రస్తుత యువత ఆశలు, లక్ష్యాలు, ఎదుర్కొంటున్న సమస్యలు, వారి నూతన ఆలోచనలను తెలుసుకోవడం నాయకులకు ఎంతో అవసరమని లోకేశ్ అన్నారు. యువత ఆకాంక్షలను సరిగ్గా అర్థం చేసుకుని, వారికి ఉపయోగపడే కార్యక్రమాలను రూపొందించడానికి ప్రజాప్రతినిధులు వారితో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు. యువతతో జరిగే ఇటువంటి ఆసక్తికరమైన, లోతైన భావాల మార్పిడి కార్యక్రమాల కోసం తాను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని తెలిపారు.మరోవైపు, లోకేశ్ అభినందనలపై కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి స్పందిస్తూ... నారా లోకేశ్ దార్శనికత, ఆలోచనల నుంచి ప్రేరణ పొందే తాము ఈ 'జెన్ జీ' సమావేశాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. నవతరం యువత ఆలోచనలు, వారి ఆకాంక్షలు, ప్రభుత్వంపై వారి అంచనాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడమే ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు.సూర్యాపేట జిల్లాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతిచెందడంపై ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కోదాడ దగ్గర రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృతి చెందడం తనను తీవ్రంగా కలిచివేసిందని తెలిపారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారికి నివాళులు అర్పిస్తున్నానని అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నానని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు అన్నదమ్ముల్లా కలిసి అభివృద్ధి సాధించాలని లోకేష్ ఆకాంక్షించారు. గతంలో ఎస్.ఎం. కృష్ణ, చంద్రబాబు మధ్య ఉన్న ఆరోగ్యకరమైన అభివృద్ధి పోటీ బెంగళూరు, హైదరాబాద్ నగరాల ఎదుగుదలకు దోహదపడిందన్నారు. దక్షిణాది రాష్ట్రాలు పరస్పర సహకారంతో ముందుకు సాగితే దక్షిణ భారతదేశాన్ని అన్ని రంగాల్లోనూ దేశంలో నంబర్-1గా నిలబెట్టవచ్చన్నారు.బళ్ళారిలో తెలుగు ప్రజలు సొంత నిధులతో 'అన్న క్యాంటీన్' ఏర్పాటు చేసి పేదల ఆకలి తీర్చడం అభినందనీయమని లోకేష్ అన్నారు. ఎన్టీఆర్ పేరుతో 'ఎన్టీఆర్ సర్కిల్' ఏర్పాటు కోసం చేసిన కృషి ఆయనపై ఉన్న అభిమానానికి నిదర్శనమన్నారు. బళ్ళారిలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలన్న తెలుగు ప్రజల సంకల్పానికి తన పూర్తి మద్దతు ఉంటుందని ఆయన తెలిపారు.ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని, బళ్ళారిలోని తెలుగు ప్రజలు రాష్ట్రానికి తిరిగి వచ్చి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని లోకేష్ పిలుపునిచ్చారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ వారికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, తెలుగు ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన చెప్పారు.

## ఎం.ఆర్.పి.యస్. సోషల్ మీడియా జాతీయ అధికార ప్రతినిధిగా నియమించడం

### నా జీవితంలో మరపురాని బాధ్యత: ప్రత్తిపాటి కోటి మాదిగ




చిలకలూరిపేట:ఆగస్ట్-28.జిల్లా ప్రతినిధి:- వరంగల్‌లో జరిగిన ఎం.ఆర్.పి.యస్. సోషల్ మీడియా అత్యవసర సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా, ఇప్పటివరకు ఎం.ఆర్.పి.యస్. సోషల్ మీడియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహిస్తున్న నన్నుఎం.ఆర్.పి.యస్. సోషల్ మీడియా జాతీయ అధికార ప్రతినిధిగా నియమించడం పట్ల హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నాపై నమ్మకం ఉంచి ఈ కీలకమైన బాధ్యతను అప్పగించిన ఎం.ఆర్.పి.యస్. వ్యవస్థాపకులు, పద్మశ్రీ మంద కృష్ణ మాదిగకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. అలాగే ఎం.ఆర్.పి.యస్. ఉద్యమంలో నేను నిర్వహించిన ప్రతి కార్యక్రమంలో నాకు అండగా నిలిచిన (ఎం.ఆర్.పి.యస్.) జాతీయ స్థాయి నుండి గ్రామ స్థాయి నాయకులకు, సోషల్ మీడియా నాయకులు, కార్యకర్తలకు, నా సహచరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.ఈ బాధ్యత నాకు లభించిన అదృష్టం మాత్రమే కాదు... (ఎం.ఆర్.పి.యస్.) ఉద్యమ భావజాలాన్ని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యతగా భావిస్తున్నాను.మంద కృష్ణ మాదిగనాయకత్వంలో (ఎం.ఆర్.పి.యస్.) ఉద్యమ లక్ష్యాలను, సామాజిక న్యాయం కోసం జరుగుతున్న పోరాటాన్ని సోషల్ మీడియా వేదికగా దేశవ్యాప్తంగా మరింత విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నా శక్తి మేరకు కృషి చేస్తాను. నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, (ఎం.ఆర్.పి. ఎస్.) సోషల్ మీడియాను మరింత బలోపేతం చేసి ఉద్యమానికి అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇస్తున్నాను. సామజిక ఉద్యమ నమస్కారాలతో -- ప్రత్తిపాటి కోటి మాదిగ( ఎం. ఆర్. పి.ఎస్.) సోషల్ మీడియా జాతీయ అధికార ప్రతినిధి

## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా



పల్నాడు జిల్లా చిలకలూరిపేట టౌన్:ఆగస్ట్-28.జిల్లా ప్రతినిధి:- చిలకలూరిపేట: స్థానిక పురపాలక సంఘంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో జరుగుతున్న ఎస్ఐఆర్ (యస్ ఐ ఆర్) ప్రక్రియను జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా పరిశీలించారు. ఈ సందర్భంగా అనామలీస్‌కు సంబంధించిన ప్రూఫ్‌లను ఏ విధంగా పరిశీలిస్తు న్నారని, వయస్సు వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు సంబంధించిన డాక్యుమెంటేషన్‌ను సక్రమంగా పరిశీలిస్తున్నారా అని ఏఈఆర్‌ఓలను జిల్లా కలెక్టర్ ప్రశ్నించారు. తమ వివరాలను అందించేందుకు ఎంతసేపటి నుంచి కార్యాలయంలో వేచి ఉన్నారో ఓటర్లను అడిగి తెలుసుకున్నారు. అలాగే బీఎల్‌ఓలు నోటీసులను స్వయంగా ఇంటికి వచ్చి అందించారా? లేక వాట్సాప్ ద్వారా పంపించారా? అని కూడా ఓటర్లను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాల పరిశీలన, డాక్యుమెంటేషన్ తదితర అంశాలను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పతి శ్రీహరిబాబు, డీఈ అబ్దుల్ రహీం, ఏఈఆర్‌ఓలు అవినాష్, పి. సుబ్బారావు, మొహిఫుద్దీన్, రాఘవేంద్ర, గిరి, ఖాదర్, సూపర్‌వైజర్లు ఖాసిం, ఖాదర్, బీఎల్‌ఓలు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసులకు రాఖీలు కట్టిన త్రివేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు




రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి నియోజకవర్గం : :రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని త్రివేణి టాలెంట్ స్కూల్‌లో రాఖీ పండుగను పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు చందానగర్ పోలీస్ స్టేషన్ సిబ్బందికి, మియాపూర్





ట్రాఫిక్ పోలీసు అధికారులకు, ఆర్సీపురం పోలీస్ స్టేషన్ సిబ్బందికి రాఖీలు కట్టి తమ ఆప్యాయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పోలీసు సిబ్బందికి రాఖీలు కట్టి, స్వీట్లు అందజేసి రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సమాజంలో ప్రజల రక్షణ కోసం నిరంతరం విధులు నిర్వహిస్తున్న పోలీసుల సేవలను విద్యార్థులు అభినందించారు. రాఖీ పండుగ విశిష్టత, అన్నాచెల్లెళ్ల అనుబంధం, పరస్పర ప్రేమాభిమానాలు, రక్షణ బాధ్యత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులు వివరించారు. పండుగల ద్వారా విద్యార్థుల్లో మానవీయ విలువలు, సామాజిక బాధ్యత, సేవాభావం పెంపొందించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. పోలీసు సిబ్బందితో కలిసి రాఖీ పండుగను జరుపుకోవడం విద్యార్థుల్లో ఆనందాన్ని నింపడంతో పాటు, పోలీసుల సేవల పట్ల గౌరవభావాన్ని మరింత పెంపొందించింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు..

## ఏపీ హైకోర్ట్ జడ్జ్ కృష్ణమోహన్ ను సత్కరించిన నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం



పల్నాడు జిల్లా బొప్పూడి:ఆగస్ట్-27 జిల్లా ప్రతినిధి:- ఏపీ హైకోర్టు జడ్జ్ బి కృష్ణమోహన్ కృషి వల్ల బొప్పూడి కొండ పైన స్వయంభువుగా వెలసిన వెంకటేశ్వర స్వామి దేవాలయం అభివృద్ధికి నోచుకుంటుందని,కోట్లాది రూపాయలు వెచ్చించి ప్రభుత్వం,టీటీడీ దేవస్థానాల అభివృద్ధికి ముందుకు రావడం ఈ ప్రాంత అదృష్టం అని నవతరం పార్టీ జాతీయ అధ్యక్షులు రావు సుబ్రహ్మణ్యం అన్నారు. బొప్పూడికొండ పైన జరిగిన యాగంలో, గాలిగోపురం శంఖుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.న్యాయమూర్తి కృష్ణమోహన్ దంపతులను నూతన వస్త్రాలతో సత్కరించారు.బైరా ప్రసాదరావు కుమార్తె ప్రిన్సిపాల్ బైరా సుజాత యాగ ద్రవ్యాలుఅందించారు.కుమారుడుప్రముఖవ్యాపార వేత్త బైరా దిలీప్ చక్రవర్తి అందించిన వస్త్రాలు, పూజ ద్రవ్యాలు అందుకున్న కృష్ణ మోహన్ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.ముందుగా కొండపై వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో మామిడి నెహ్రూ,రావు రవితేజ,బైరా శ్రీను పాల్గొన్నారు.

## గవర్నర్ చేతుల మీదుగా అలయ అభివృద్ధి పనుల శంకుస్థాపన.. ఎంతో ఆనందాన్ని కలిగించింది

### బొప్పూడి కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన గవర్నర్.

### గ్రామ విశిష్టత, ఆలయ విశేషాలను స్వయంగా గవర్నర్ కు వివరించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి



పల్నాడు జిల్లా బొప్పూడి :ఆగస్ట్-27.జిల్లా ప్రతినిధి:- బొప్పూడి కొండపై కొలువైన శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా రూ.10.99 కోట్ల టీటీడీ నిధులతో చేపట్టిన పలు పనులకు గురువారం రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా శంకుస్థాపన జరగడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి బొప్పూడి కృష్ణ మోహన్, జిల్లా న్యాయమూర్తి, జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సహా పలువురు ప్రముఖులతో కలిసి గొప్ప దైవకార్యంలో పాలుపంచుకోవడం మంచి ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందన్నారు. గురువారం బొప్పూడిలో జరిగిన ఆలయాభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బొప్పూడి గ్రామ విశిష్టత, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయ విశేషాలను ప్రత్తిపాటి స్వయంగా గవర్నర్ కు వివరించారు. తమ నియోజకవర్గంలో ఒక మంచి



కార్యక్రమానికి విచ్చేసిన గవర్నర్ కు ప్రత్తిపాటి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. గురువారం చిలకలూరిపేట మండలం బొప్పూడి పర్యటనకు విచ్చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్ స్థానిక కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధిలో భాగంగా పలు పనులకు శంకుస్థాపన చేశారు. తొలుత గ్రామంలో నిర్మించనున్న పుష్కరిణి పనులకు భూమిపూజ చేసిన ఆయన, అక్కడే ఏర్పాటుచేయనున్న గరుడ విగ్రహానికి శంకుస్థాపన చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ పండితుల వేదాశ్వీరచనం పొందారు. తర్వాత కొండపైకి వెళ్లే మెట్లమార్గం వద్ద అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఆయన.. శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అంతకు ముందు గవర్నర్ నజీర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీస్ పరేడ్ లో పాల్గొని పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఐజీ సర్వశ్రేష్ట త్రిపాఠి, జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, జేసీ సంజన సిన్హా, ఆర్డీవో బాలకృష్ణ, కూటమి నాయకులు ఆడక స్వాములు, షేక్ కరిముల్లా, జవ్వాజి మధన్ మోహన్, అంబటి సొంబాబు, గుంటి కోటేశ్వరరావు, వలేటి లక్ష్మీ నారాయణ, వలేటి హిమవంతరావు, గ్రామ నాయకులు, అధికారు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ మాజీ మంత్రిని హరీశ్‌రావును హనుమకొండలో అదుపులోకి తీసుకున్న పోలీసులు.



హనుమకొండ జిల్లా, ఆగస్టు 27 .: మాజీ మంత్రి తన్నీరు హరీశ్రావు ను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా, ఆయన పోలీసు వాహనంలో ఎక్కేందుకు నిరాక రించారు. సుబేదారి కలెక్టరేట్ నుంచి సమీపంలోని పోలీస్ స్టేషన్ వరకు కాలినడకన ముందుకు సాగారు.ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నడిచారు. హరీశ్రా వుకు మద్దతుగా భారీగా జనం తరలిరావడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. టీఎన్‌జీవోల ధర్నాలో పాల్గొనేం దుకు వచ్చిన ఆయనను పోలీసులు అరెస్ట్ చేయడంతో కలెక్టరేట్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసుల తీరుపై బీఆర్ఎస్ శ్రేణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాయి.వరంగల్, హనుమ కొండ ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు. పాలి టెక్నిక్ కళాశాల పరిసరాల్లో భద్రతను పెంచారు. పలువురు విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. హరీశ్‌రావు అరెస్ట్ నేపథ్యంలో జీవో 97, ఉద్యోగుల సమస్యలు, ప్రభుత్వ చర్యలపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.హరీష్ రావు పాలిటెక్నిక్ కళాశాలలో జరిగిన నిరసన కార్యక్రమంలో పాల్గొని, అక్కడ సమావేశమైన వారిని ఉద్దేశించి ప్రసంగించారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు, అలాగే వారి న్యాయమైన డిమాండ్లకు బి ఆర్ ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుం దని పేర్కొన్నారు. ఈ సందర్భం గా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రభుత్వం చెప్పే దానికి, చేసేదానికి పొంతన లేదని విమర్శించారు. పాలి టెక్నిక్ విద్యా వ్యవస్థలో మార్పులకు సంబంధించి ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నం.97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు ఆందోళన కొనసాగిస్తున్నారు. పాలిటెక్నిక్ విద్యను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ లో విలీనం చేసే ప్రతిపాదనకు వ్యతిరేకంగా విద్యార్థులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.

## నేపాల్ వరదల్లో చిక్కుకున్న తెలంగాణ వాసుల సహాయార్థం హెల్ప్‌లైన్ ఏర్పాటు.



తెలంగాణ,ఆగస్టు 27, నేపాల్‌లో సంభవించిన భారీ వరదల కారణంగా అక్కడ చిక్కుకున్న లేదా ఇబ్బందులు ఎదుర్కొంటున్న తెలంగాణ వాసులకు అవసరమైన సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేప ట్టింది.నేపాల్‌లోని పరిస్థితు లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అక్కడ ఉన్న తెలంగాణ వాసుల కు అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక హెల్ప్‌లైన్ మరియు సమన్వయ కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది.నేపాల్‌లో ఉన్న తెలంగాణ వాసులకు అవసరమైన సహాయం అందిం చేందుకు తెలంగాణ భవన్ అధి కారులు కేంద్ర విదేశాంగ మంత్రి త్వ శాఖ, ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయంతో పాటు ఇతర సంబంధిత అధికా రులతో నిరంతరం సమన్వయం చేస్తున్నారు.నేపాల్‌లో ఉన్న తెలంగాణకు చెందిన యాత్రికు లు, పర్యాటకులు లేదా ఇతర వ్యక్తులతో సంప్రదింపులు జరప లేకపోతున్న కుటుంబ సభ్యులు న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్ హెల్ప్‌లైన్‌ను సంప్రదించవచ్చు. సహాయక చర్యల సమన్వయా న్ని సులభతరం చేసేందుకు సంబంధిత వ్యక్తుల పేరు, పాస్ పోర్ట్ వివరాలు, మొబైల్ నంబర్, నేపాల్‌లో ప్రస్తుతం ఉన్న లేదా చివరిగా తెలిసిన ప్రాంతం, ట్రావెల్ /టూర్ ఆపరేటర్ వివరా లు, కుటుంబ సభ్యుల సంప్రదిం పు వివరాలను హెల్ప్‌లైన్ అధికా రులకు అందించాలి.హెల్ప్‌లైన్ నంబర్లు:శ్రీమతి వందన పీఎస్ టు రెసిడెంట్ కమిషనర్ & లైజన్ హెడ్ మొబైల్: 9871999044.. శ్రీ సి.హెచ్. చక్రవర్తి పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ మొబైల్: 9949351270. జి. రక్షిత్ నాయక్ లైజన్ ఆఫీసర్ మొబైల్: 9618597969 నేపాల్‌లో ఉన్న తెలంగాణ వాసులకు అవసరమైన సహాయం అందించేందుకు హెల్ప్‌లైన్ అధికారులు అందుబాటులో ఉంటారు. హెల్ప్‌లైన్‌కు అందే విజ్ఞప్తులను ప్రాధాన్యతా ప్రాతిపదికన సంబంధిత కేంద్ర ప్రభుత్వ విభాగాలు, ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన సహాయం అందించేందుకు సమన్వయం చేస్తారు. నేపాల్ లోని పరిస్థితులను తెలంగాణ ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షి స్తూ, అవసరమైన తదుపరి చర్యలను సంబంధిత అధికా రులతో సమన్వయం చేసుకుం టుంది.

## కలెక్టరేట్ ఎదుట టిజిఈజెఎసి మహాధర్నా.ఉద్యోగుల హోరెత్తిన నిరసన



సిరిసిల్ల జిల్లా, ఆగస్టు 27, : ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికై సిరిసిల్ల కలెక్టరేట్ ముట్టడి. టిజి ఈజెఏసి ఆధ్వర్యంలో మహాధర్నా 2అన పిఆర్సి ,6డిఎ లు, ఓ పిఎస్ అమలుకై డిమాం డ్. తెలంగాణ ప్రభుత్వ ఉద్యో గులు, ఉపాధ్యాయులు, గెజి టెడ్ అధికారులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టిజిఈజెఏసి ఆధ్వ ర్యంలో గురువారం సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు.ఈ కార్యక్ర మానికి పెద్ద సంఖ్యలో ఉద్యో గులు, ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల నాయకులు హాజర య్యారు. ఉద్యోగుల ప్రధాన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మహాధర్నాలో నినాదాలు చేశారు.2వ పిఆర్సి ని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన ఈ హెచ్సి ను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు.అలాగే సిపిఎస్ ను రద్దు చేసి ఓపిఎస్ ను అమలు చేయాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఉద్యోగులకు సంబంధించిన రూ.2 వేల కోట్ల పెండింగ్ బిల్లులను ప్రతి నెలా విడుదల చేయాలని ప్రభుత్వా న్ని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గెజిటెడ్ అధికారులు, కార్మికులు, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని టీజీ ఈజెఏసి నాయకులు డిమాండ్ చేశారు. ప్రధాన డిమాండ్లు 2వ పిఆర్సి ని వెంటనే అమలు చేయాలి పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను విడుదల చేయాలి ఈ హెచ్ సి ను సమర్థవంతంగా అమలు చేయాలి సి పి ఎస్ ను రద్దు చేసి ఓ పి ఎస్ ను అమలు చేయాలి రూ.2 వేల కోట్ల పెండింగ్ బిల్లులను ప్రతి నెలా విడుదల చేయాలి.

## కోదాడ డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ నరసింహ వార్షిక తనిఖీలు....



సూర్యాపేట జిల్లా, ఆగస్టు 27, ": కోదాడ డీఎస్పీ కార్యాలయంలో ఎస్పీ నరసింహ వార్షిక తనిఖీలు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, శాంతిభద్రతలపై అప్రమత్తంగా ఉండాలని అధికారుల ఆదేశం.స్థానిక కోదాడ డీఎస్పీ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ నరసింహ వార్షిక తనిఖీ చేశారు.ఈ సంద ర్భంగా ఆయన కార్యాలయ రికార్డులు, వివిధ కేసుల దర్యాప్తు తీరు తెన్నులు, పోలీస్ స్టేషన్ల నిర్వహణ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనం తరం పోలీస్ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించి, శాఖపరమైన పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్పీ నరసింహ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం అధి కారులు ఎల్లప్పుడూ అప్రమ త్తంగా ఉంటూ పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా పెండింగ్ కేసుల దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేసి, బాధితులకు త్వరగా న్యాయం అందేలా చూడాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారిం చాలని, జాతీయ రహదారిపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే (బ్లాక్ స్పాట్స్) ప్రాంతాలను గుర్తించి తగిన నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంతో పాటు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సానుకూలంగా స్పందించి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా పోలీసు సిబ్బంది బాధ్యతాయు తంగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. తనిఖీలు మరియు సమీక్షా సమావేశం అనంతరం ఎస్పీ నరసింహ డీఎస్పీ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని పిలుపునిచ్చారు.

## విద్యార్థులకు బూట్లు, బెల్టులు పంపిణీ చేసిన సర్పంచ్.



నాగర్ కర్నూల్ జిల్లా, ఆగస్టు 27, .:ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కు బెల్టు,టై,ఐడి కార్డు, బూట్లు, చేర్మూర్ గ్రామ సర్పంచ్ బచ్చ లకూర శ్రీనివాసులు, బిఆర్ఎస్ పార్టీ నాయకుడు చెరుకూరి రామరాజు మరియు గ్రామపం చాయతీ కార్యదర్శి బాలరాజు తమ సొంత ఖర్చులతో విద్యార్థులకు అందజేశారు, అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి ఒక్క విద్యార్థికి అన్ని వసతులతో ప్రైవేటు పాఠశాలలకు సమా నంగా చదువుకోవాలనే ఉద్దే శంతోనే ఈ కార్యక్రమం నిర్వ హించినట్లు తెలిపారు, విద్యా ర్థులు క్రమశిక్షణ, శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిం చారు,ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యార్థుల వస తుల కల్పనకు తమ వంతు సహాయ సహకారాలు ఎల్ల ప్పుడూ ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు,ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ కొండలు, గ్రామపంచాయతీ కార్యదర్శి బాలరాజు, వార్డు మెంబర్ పురుగుల లాలయ్య, రమేష్, జంగయ్య, మరియు ప్రధానోపా ధ్యాయురాలు మౌనిక, ఉపాధ్యా యురాలు గీత పాల్గొన్నారు

## గట్టు మండలంలో గుప్త నిధుల కలకలం గుట్టపై అర్ధరాత్రి క్షుద్ర పూజలు



గద్వాల జిల్లా, ఆగస్టు 27, : జోగులాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలో గుప్త నిధుల కోసం అర్ధరాత్రి వేళ తవ్వకాలు చేపట్టిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఉన్నత పాఠశాల వెనుక ఉన్న గుట్టపై గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు నిర్వహించి, గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టి నట్లు గ్రామస్తులు చెబుతున్నా రు.కాగా,గడిచిన మూడు నెలల్లోనే గ్రామంలోని వేర్వేరు ప్రాంతాల్లో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రి వేళల్లో రహస్యంగా తవ్వకాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వరుస ఘట నలపై అధికారులు స్పందించి, తవ్వకాలు చేస్తున్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నా రు. గుప్త నిధుల పేరుతో జరుగు తున్న తవ్వకాల వెనుక ఎవరు న్నారు? అధికారుల నిఘా ఎందుకు కొరవడింది అనే ప్రశ్నలు స్థానికంగా చర్చనీయాం శంగా మారాయి.గట్టులో గుప్త నిధుల కలకలం, అర్ధరాత్రి క్షుద్ర పూజలు.. గుట్టపై తవ్వకాలు. మూడు నెలల్లో మూడు చోట్ల తవ్వకాలు,గుప్త నిధుల తవ్వకాలు.

# 22ఏ భూముల వివాదంపై బీజేపీ పోరుబాట!



తెలంగాణ,ఆగస్టు 27, : తెలంగాణ రాజకీయాల్లో భూ వివాదాలు ఎప్పుడూ రణరం గాన్ని సృష్టిస్తూనే ఉంటాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ సమస్యలు తీవ్ర దుమారం రేపగా, ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తున్న 'భూభారతి' రెవెన్యూ పోర్టల్, రిజిస్ట్రేషన్ చట్టం సెక్షన్ 22ఏ సమస్యలు సరికొత్త రాజకీయ రగడకు దారితీస్తున్నాయి. ఈ క్రమంలో 22ఏ పరిధిలో చిక్కుకుపోయిన వేలాది మంది రైతులు, భూ యజమానుల సమస్యలను అస్త్రంగా మార్చుకుని అధికార కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గట్టిగా ఇరుకున పెట్టేందుకు బీజేపీ సమగ్ర కార్యాచరణను సిద్ధం చేసింది.నిషేధిత జాబితాలో చేరిన 22ఏ భూముల వ్యవహారంలో బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర బీజేపీ నాయకత్వం ప్రత్యక్ష కార్యాచరణకు దిగింది. బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. సెప్టెంబర్ 5, 6 తేదీల్లో హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వేదికగా పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, 22ఏ సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న భూ బాధితులతో కలిసి భారీ ఎత్తున నిరసన దీక్షలు చేపట్టనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వం వెంటనే దిగివచ్చి భూభారతి పోర్టల్ లోపాలను సరిదిద్ది, 22ఏ రికార్డులను క్లియర్ చేయకపోతే రాబోయే రోజుల్లో ఏకంగా తెలంగాణ అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు.22ఏ భూముల జాబితా రూపకల్పన, సవరణ ల్లో ప్రభుత్వం భారీ అవకతవ కలకు పాల్పడుతోందని బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయి లో ధ్వజమెత్తారు. అధికార పలుకుబడిని దుర్వినియోగం చేస్తూ కొందరు పెద్దల ప్రయోజ నాల కోసం నిషేధిత 22ఏ జాబితా నుంచి కొన్ని భూముల ను ఏకపక్షంగా, ఇష్టారాజ్యంగా తొలగిస్తున్నారని, అదే సమయంలో సామాన్య ప్రజల భూములను మాత్రం నిబంధ నలకు విరుద్ధంగా ఆ జాబితా లోకి చేరుస్తున్నారని ఆరోపించా రు. రాష్ట్రంలో జరుగుతున్న అనుమానాస్పద భూ బదిలీలు, లావాదేవీలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రజలకు స్పష్టమైన సమాధానం ఇవ్వాలనిడిమాండ్ చేశారు. ఈ వ్యవహారం వెనుక భారీ కుట్ర దాగి ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతుంటే, సీఎం రేవంత్ రెడ్డి ఆ ఆరోపణలను కొట్టిపారేయడం అనేక కొత్త ప్రశ్నలకు తావిస్తోందని మండిపడ్డారు. దీనికి బాధ్యులైన వారిని ప్రభుత్వం ఎందుకు గుర్తించడం లేదని నిలదీశారు. మరోవైపు, తెలంగాణలో తన రాజకీయ ప్రాబల్యాన్ని విస్తరించే క్రమంలో బీజేపీ ఈ నిరసనలకు సమాంతరంగా భారీ సభకు కూడా సన్నద్ధమవుతోంది. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ నేతృత్వంలో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అపార జనసందోహంతో భారీ బహిరంగ సభను నిర్వహించ నుంది.తెలంగాణలో భూ వివాదాలు కేవలం పరిపాలనా పరమైన సమస్యలు మాత్రమే కావు. అవి ప్రజల సెంటిమెంట్ తో, జీవనోపాధితో ముడిపడిన తీవ్ర సున్నితమైన అంశాలు. 22ఏ సమస్యల పరిష్కారంలో జరుగుతున్న జాప్యం, లోపాలను ఆధారంగా చేసుకుని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజాక్షేత్రంలో దోషిగా నిలబెట్టేందుకు బీజేపీ పకడ్బందీ వ్యూహాన్ని అమలు చేస్తోంది. సెప్టెంబర్ 5, 6 ధర్నాలు, ఆపై సెప్టెంబర్ 17 సభల ద్వారా ఒకవైపు పరిపాలనా వైఫల్యాలను, మరోవైపు భావోద్వేగ అంశాలను ఏకకాలంలో రగిల్చి రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్ష స్థానాన్ని పటిష్టం చేసుకోవాలని కమలదళం భావిస్తోంది. ఈ పరిణామాలు రేవంత్ రెడ్డి సర్కార్‌పై తీవ్ర పరిపాలనా, రాజకీయ ఒత్తిడిని పెంచుతున్నాయి.

## వరంగల్‌కు చెందిన యువకుడు ములుగులోని హోటల్‌లో బిర్యానీ తిన్న తర్వాత అస్వస్థతకు గురై మృతి.



ములుగు జిల్లా, ఆగస్టు 27, : ములుగులో ఓహోటల్లో బిర్యానీ తిన్న తర్వాత అస్వస్థకు గురై హోటల్ ముందే మృతి. వరంగల్ జిల్లా దేశాయిపేటలోని నవయుగ కాలనీకి చెందిన నాగ సుకృత్ (22) గా గుర్తింపు. స్నేహితులతో కలిసి వెంకటా పూర్ మండలం రామప్ప ఆలయ సందర్శనానికి వచ్చిన నాగ సుకృత్. తిరిగి వెళుతుండ గా ములుగులో ఓ హోటల్లో బిర్యానీ తిన్న తర్వాత పడి పోయిన యువకుడు. హోటల్ యజమానులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ములుగు జనరల్ హాస్పిటల్ తరలింపు. పరీక్షించిన అనంత రం నాగ సుకృత్ చని పోయిన ట్టుగా నిర్ధారించిన వైద్యులు. విషయం తెలుసుకున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు హోటల్ కు చేరుకొని బిర్యాని శాంపిల్స్ ల్యాబ్ తరలించారు. యువకుడి మృతి పై ఫుడ్ సేఫ్టీ అధికారుల ను ఫోన్లో వివరాలు కోరిన హెచ్ ఎంటీవీ రిపోర్టర్ ఫుడ్ పాయిజన్ కాలేదంటూ స్పష్టం చేసిన ఫుడ్ సేఫ్టీ అధికారులు. ములుగు జనరల్ హాస్పిటల్లో మృతదేహా న్ని పోస్టు మార్టం నిమిత్తం భద్రపరిచిన పోలీసులు. నాగ సుకృత్ మరణానికి గల కార ణాలు తెలియవలసి ఉంది కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు.

## హైటెక్ సిటీలోని యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా.



హైదరాబాద్ జిల్లా, ఆగస్టు 27: అనారోగ్యంతో హైటెక్‌సిటీలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పరామర్శిం చారు. గవర్నర్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలు సుకున్నారు. గవర్నర్‌కు అందు తున్న వైద్య చికిత్స, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితిపై ఆస్పత్రి వర్గాల నుంచి సీఎం వివరాలు తెలుసుకున్నారు.గవర్నర్ త్వరగా కోలుకోవాలని ఆకాం క్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రితో పాటు ఎంపీ వేం నరేందర్ రెడ్డి కూడా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను పరామర్శిం చారు. గవర్నర్ ఆరోగ్యంపై ఆరా తీసి, ఆయనకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయా అనే విషయాన్ని అడిగి తెలుసుకు న్నారు.

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు




హిందూపురం,: స్థానిక శ్రీ చైతన్య పాఠశాలలో రక్షాబంధన్ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల ఏజీఎం సుబ్బారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్షాబంధన్ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పవిత్రమైన పండుగ అని, అన్నాచెల్లెళ్లు లేదా అక్కతమ్ముడు మధ్య ప్రేమ, అనురాగం, ఆప్యాయత, పరస్పర రక్షణ భావానికి ప్రతీకగా ఈ పండుగను ప్రతి సంవత్సరం జరుపుకుంటారని తెలిపారు. కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేయడంతో పాటు పరస్పర గౌరవం, బాధ్యత, అనుబంధాలను పెంపొందించడంలో రక్షాబంధన్ ప్రత్యేక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే భారతీయ సంస్కృతి, సాంప్రదాయ విలువలను తెలుసుకొని ఆచరించాలని ఆయన సూచించారు. అనంతరం విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలియజేయగా, విద్యార్థులు పరస్పరం సోదరభావాన్ని చాటుతూ ఆనందోత్సాహాలతో వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు, కుటుంబ బంధాల పట్ల గౌరవం పెంపొందించే ఉద్దేశంతో ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలను ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ ప్రభాకర్ రెడ్డి, డీన్ నాగరాజు, ప్రైమరీ ఇన్‌చార్జి అరుణ, ప్రీ-ప్రైమరీ ఇన్‌చార్జి శ్వేతతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్షాబంధన్ వేడుకలను విజయవంతం చేశారు.

## సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో వృద్ధురాలిని క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించిన ఆరిలోవ పోలీసులు.

విశాఖపట్నం ఆగస్టు -27: జిల్లా ఇంచార్జ్.సుమారు 83-85 సంవత్సరాల వయసు గల ఒక వృద్ధ మహిళ ఈరోజు ఉదయం విశాఖపట్నం జోడిగుడ్లపాలెం బీచ్ వద్ద సంచరిస్తూ కనిపించగా, బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ అప్పలనాయుడు గుర్తించి, ఆమెను రక్షించి ఆరిలోవ పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చారు. ఆమెను విచారించగా తన సొంత ఊరు విజయనగరం జిల్లా అని, తన పిల్లలు విశాఖపట్నంలో ఉంటారని, కానీ ఎక్కడ ఉంటారో తెలియదని చెప్పింది. ఇటీవలే ఆమెకు ఆపరేషన్ జరిగిందని, పూర్తి వివరాలు గుర్తు లేవని తెలిపింది. వెంటనే సీఐ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఆమెకు పోలీస్ స్టేషన్ లో భోజనం ఏర్పాటు చేసి, విజయనగరం జిల్లా గుర్ల మండలం, తెట్టంగి / రౌతుపేట గ్రామం ఆమె స్వగ్రామం అని తెలుసుకున్నాము. గుర్ల ఎస్ ఐ సహకారంతో ఆ గ్రామ సర్పంచ్ ద్వారా విశాఖపట్నం సీతంపేటలో ఆటో నడుపుతున్న ఆమె పెద్ద కొడుకును సంప్రదించాము. ది. 26.08.2026 సాయంత్రం 6:30 గం. నుండి తల్లి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు వెతుకుతున్నారని తెలిసింది. వెంటనే కుటుంబ సభ్యులను స్టేషన్ కు పిలిపించి, హెచ్ సీ కన్ననరావు సహాయంతో వృద్ధురాలిని ఆమె పెద్ద కొడుకు మరియు కూతురికి క్షేమంగా అప్పగించడం జరిగింది.



## పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు అందజేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్



విశాఖపట్నం ఆగస్టు -27: జిల్లా ఇంచార్జ్.సౌత్ జోనల్ కార్యాలయంలో ఈరోజు స్థానిక శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్ పలువురు పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నగరంలోని వీధులు, రహదారులను పరిశుభ్రంగా ఉంచడంలో



పారిశుధ్య కార్మికులు నిరంతరం ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఎండ, వర్షాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్యం కూడా బాగుండేలా అవసరమైన సహకారం అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పారిశుధ్య కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం కొబ్బరినూనె, సబ్బులు పంపిణీ చేయడం అభినందనీయమైన చర్య అని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సౌత్ జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు తో పాటు జోనల్ కార్యాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో 'ఒరిజినల్ వర్సెస్ వలస' రచ్చ.

తెలంగాణ, ఆగస్టు 27, : తెలంగాణ కాంగ్రెస్ లో పార్టీ అంతర్గత రాజకీయాలు, ఆధిపత్య పోరు మరోసారి రచ్చకెక్కుతున్నాయి. కొండా సురేఖ వ్యవహారం, తాజా పరిణామాల నేపథ్యంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. క్రమశిక్షణ, అధిష్ఠానం నిర్ణయాల ప్రాధాన్యతను నొక్కి చెబుతూనే, పార్టీలోని వలస నేతలు వర్సెస్ అసలైన కాంగ్రెస్ వాదులు అనే అంతర్గత వైరుధ్యాన్ని ఆయన బలంగా తెరపైకి తెచ్చారు.

ప్రజాభవన్‌లో ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్కతో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి, ప్రస్తుత రాజకీయ వివాదాలపై తనదైన శైలిలో స్పందించారు. కొండా సురేఖ, ఆమె కుమార్తె సుస్మిత, అలాగే చిన్నారెడ్డి వ్యాఖ్యలకు సంబంధించిన అంశాలను పార్టీ క్రమశిక్షణా కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి పీసీసీకి నివేదిక సమర్పించిందని గుర్తుచేశారు. ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే తుది నిర్ణయమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం ఇదే విషయాన్ని పునరుద్ఘాటించారని, సీఎం తీసుకున్న వైఖరితో తాను పూర్తి స్థాయిలో ఏకీభవిస్తున్నట్లు పేర్కొన్నారు. తాను ఎన్నడూ పార్టీని గానీ, ముఖ్య మంత్రిని గానీ, ఏ ఒక్క నాయకుడిని గానీ వ్యక్తిగతంగా విమర్శించలేదని, పార్టీ గీత దాటే ప్రసక్తే లేదని స్పష్టమైన రాజకీయ సందేశాన్ని ఇచ్చారు. ఈ వివాదానికి అతీతంగా, కాంగ్రెస్ అంతర్గత నిర్మాణంలో నెలకొన్న అసంతృప్తిని రాజ గోపాల్ రెడ్డి బహిర్గతం చేశారు. 2018 శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా పలువురు కాంగ్రెస్ హేమాహేమీలు ఓటమి పాలైన క్లిష్ట సమయంలో, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాజకీయ ఆధిపత్యాన్ని, విపక్షాలను నామరూపాలు లేకుండా చేయాలన్న ఎత్తుగడలను ఎదుర్కొని మునుగోడు ప్రజల ఆశీర్వాదంతో తాను గెలిచానని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన, ప్రజా సమస్యలు, అవినీతిపై అలుపెరగని పోరాటం చేశానని వివరించారు. అయితే, ఎన్నికలకు కొద్ది రోజుల ముందే ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చి గెలిచిన కొందరు నేతలు.. ఏళ్ల తరబడి పార్టీ జెండా మోసిన అసలైన కార్యకర్తలను, సీనియర్లను విస్మరిస్తుండటంపై ఆయన పరోక్షంగా మండిపడ్డారు. పార్టీని నమ్ముకుని ఉన్న నిజమైన కాంగ్రెస్ రక్తం ఉన్న నాయకుల ను, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నిబద్ధత గల కార్యకర్త లను కాపాడుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర నాయకత్వం, హైకమాండ్‌పై ఉందని గట్టిగా డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో కొత్తగా వచ్చిన వారికి టిక్కెట్లు ఇవ్వడం వల్ల సుదీర్ఘకాలం పార్టీకి సేవ చేసిన నిజమైన కాంగ్రెస్ శ్రేణులకు అన్యాయం జరుగుతుందన్న విషయాన్ని తాను గతంలోనే ప్రస్తావించానని తెలిపారు. తనపై విమర్శలు చేసే నాయకు లు తమ స్థాయిని, ఉద్దేశాలను ఆత్మపరిశీలన చేసుకోవాలని హితవు పలికారు. తెలంగాణ అభివృద్ధి, అవినీతి రహిత పాలనతో పాటు రాహుల్ గాంధీని దేశ ప్రధానమంత్రిగా చూడటమే తన ఏకైక పరమావధి అని రాజగోపాల్ రెడ్డి పునరుద్ఘాటించారు. పార్టీని బలోపేతం చేయడానికే మాట్లాడతానని, బలహీనపరిచే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. ఇతర పార్టీల నుంచి వచ్చి కీలక పదవుల్లో ఉన్న వ్యక్తులు పార్టీ శ్రేయస్సును దెబ్బతీసే కథనాలు రాయించ డం లేదా వివాదాలు సృష్టించ డం సరికాదని హెచ్చరించారు. మొత్తంగా చూస్తే, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత సమీకరణాలను మరోసారి వేడెక్కించాయి. హైకమాండ్, సీఎంతో ఎటువంటి విభేదాలు లేవని చెప్తూనే.. కొత్తగా పార్టీలో చేరి ఆధిపత్యం చలాయిస్తున్న నాయకులకు గట్టి హెచ్చరిక జారీ చేశారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో సాగాల్సిన కీలక సమయంలో సీనియర్లు, పాత కాంగ్రెస్ వాదుల అసంతృప్తిని హైకమాండ్ ఎలా సమన్వయం చేస్తుందో వేచి చూడాలి.



# ఘోర దుర్ఘటనలో ఏడుగురు మరణించడం అత్యంత బాధాకరం : ప్రత్తిపాటి

ప్రమాదంలో 7 గురు మరణించడం మిక్కిలి విషాదకరం.

పుట్టినరోజు వేడుకలకు వెళ్లి వస్తుండగా ప్రమాదం జరిగింది.

వేలూరు గ్రామానికి చెందిన 15 మందిలో ఏడుగురు మరణించారు.

మృతుల్లో ఆరుగురు మహిళలే.

దుర్ఘటన గురించి ముఖ్యమంత్రికి తెలియచేయడం జరిగింది. ప్రమాద కారణాలపై సీఎంవో అధికారులు, హోం మంత్రి అనిత జిల్లా అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

మృతుల కుటుంబాలకు అన్నివిధాల అండగా ఉంటాం.. ప్రభుత్వపరంగా వారిని ఆదుకుంటాం

చిలకలూరిపేటలో రోడ్డు ప్రమాద క్షతగాత్రుల్ని పరామర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడిన ప్రత్తిపాటి



పల్నాడు జిల్లా చిలకలూరిపేట టౌన్ : ఆగస్ట్-27.జిల్లా ప్రతినిధి:- చిలకలూరిపేట వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మరణించడం అత్యంత బాధాకరమని, వేలూరు గ్రామానికి చెందిన 15 మంది ఆటోలో పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి వస్తూ, ప్రమాదానికి గురయ్యారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం అర్ధరాత్రి 12.45 గంటలకు ప్రమాదం జరిగిందని, దుర్ఘటనపై వెంటనే పోలీస్ వారిని, వైద్యాధికారుల్ని అప్రమత్తం చేశామని ఆయన చెప్పారు. ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై స్థానిక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నక్షతగాత్రుల్ని ప్రత్తిపాటి గురువారం ఉదయం పరామర్శించారు. బాధితులు, వారి కుటుంబసభ్యులతో మాట్లాడిన ఆయన, అధైర్యపడవద్దని, అన్నివిధాలా అండగా ఉంటామని వారికి భరోసా ఇచ్చారు. అనంతరం వైద్యులతో మాట్లాడిన ప్రత్తిపాటి... బాధితులు కోలుకునేవరకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, గుంటూరు.. విజయవాడకు తరలించాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం అర్ధరాత్రి జాతీయ రహదారిపై ఆటోను ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకే గ్రామానికి చెందిన ఏడుగురు మరణించారని, చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రి, ప్రైవేట్ ఆసుపత్రి, గుంటూరు జీజీహెచ్ లో చికిత్స పొందుతున్నవారిలో కొందరి పరిస్థితి విషమంగానే ఉందని, వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యుల్ని ఆదేశించినట్టు ప్రత్తిపాటి పేర్కొన్నారు. దుర్ఘటన గురించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియచేశామని, మృతుల కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరినట్టు ప్రత్తిపాటి తెలిపారు. దుర్ఘటన సమాచారం తెలిసిన వెంటనే సీఎంవో అధికారులు, హోం మంత్రి అనిత అధికారులతో మాట్లాడారని ప్రత్తిపాటి తెలిపారు. చిలకలూరిపేటలో ఈ మధ్యకాలంలో ఇంతటి ఘోర ప్రమాదం ఎప్పుడూ జరగలేదని, పొరపాటు ఎవరిదైనప్పటికీ పేద కుటుంబాలకు చెందిన ఏడుగురు చనిపోవడం దారుణమని ప్రత్తిపాటి ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రుల్లో ముగ్గురు చిలకలూరిపేట ప్రైవేట్ ఆసుపత్రిలో, నలుగురు గుంటూరు జీజీ హెచ్ లో చికిత్స పొందుతున్నారని వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు చెప్పారని ప్రత్తిపాటి తెలిపారు. దుర్ఘటనలో ఒక చిన్నపాప సురక్షితంగా బయటపడిందని ప్రత్తిపాటి చెప్పారు. మరణించిన ఏడుగురిలో 6 గురు 50 ఏళ్లు పైబడిన మహిళలని, ఒకరు పురుషలని, వారంతా ఘటనాస్థలంలోనే చనిపోయారన్నారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ తో మాట్లాడి. అక్కడ చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించామన్నారు. మృతుల కుటుంబాలను ఆదుకోవడానికి అన్ని విధాలా సహకరిస్తామని.. ప్రైవేట్ ట్రావెల్స్ వారితో మాట్లాడి, తగిన పరిహారం అందించేలా చూడాలని అధికారుల్ని ఆదేశించామని ప్రత్తిపాటి తెలిపారు. టీడీపీ బీమా ఉన్న వాళ్ళకి త్వరలోనే పార్టీ నుంచి సాయం అందుతుందన్నారు. మృతులు కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియచేసిన ప్రత్తిపాటి.. ప్రభుత్వపరంగా ఆ కుటుంబాలకు అండగా ఉంటామని, ఎవరూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు.



మృతుల వివరాలు.

1. బొంత మణిమ్మ 2. బొంత బాబురావు. 3. బొంత సంపూర్ణమ్మ 4. చౌటపల్లి లక్ష్మి5. బొంత గంగమ్మ 6. బొంత మరియమ్మ 7. చౌటుపల్లి సువార్తమ్మ.

## తెలుగుకు వెలుగు గిడుగు గిడుగు 163వ జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం.

### యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



విశాఖపట్నం, ఆగస్టు -27 జిల్లా ఇంచార్జ్: వ్యవహారిక భాషోద్యమ పితామహుడు, భాషాతపస్వి 'కళాప్రపూర్ణ' గిడుగు వేంకట రామమూర్తి 163వ జయంతి సందర్భంగా ఆంధ్ర విశ్వకళాపరిషత్ తెలుగు శాఖలో గురువారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ గిడుగు రామమూర్తి తన జీవితాన్ని వ్యవహారిక భాషోద్యమానికి అంకితం చేసిన కారణజన్ముడని కొనియాడారు. లోకనాయక్ ఫౌండేషన్ తరఫున తెలుగు శాఖకు రూ.లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ అందజేస్తున్నట్లు ప్రకటించారు. దాని వడ్డీతో ప్రతి ఏటా గిడుగు జయంతి రోజున భాషా ప్రావీణ్యం కనబరిచిన పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులకు అవార్డులు ఇవ్వాలని కోరారు. ఆచార్య జర్రా అప్పారావు మాట్లాడుతూ గిడుగు గ్రాంథిక భాషకు వ్యతిరేకి కాదని, వ్యవహారిక భాషా సాహిత్యానికి పూర్వరంగం వేసిన మహనీయుడని అన్నారు. గిడుగు సేవలను గుర్తించి 1938లో ఆంధ్ర విశ్వకళాపరిషత్ 'కళాప్రపూర్ణ' బిరుదుతో సత్కరించిందని తెలిపారు. ఆచార్య నల్లా సత్యనారాయణ, ఆచార్య గజ్జ యోహాన్ బాబు, డా. మరడాన సుబ్బారావు, ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య అడ్డాడ నరసింహారావు, డా. చంద్రశేఖరరావు ప్రసంగించారు. గిడుగు వ్యవహారిక, సవర భాషల అభివృద్ధికి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అధ్యాపకులు డా. ఎం. కృష్ణవేణి, డా. ఎం. దాసు, డా. బి. సూర్యనారాయణ, డా. ఎం. ప్రతాప్, డా. పి. శ్రీనివాసరావు, డా. ఎల్. గిరీష్‌కుమార్, డా. ఆర్. శివయ్య, ఎం.ఏ. తెలుగు పూర్వవిద్యార్థి, ఏయూ పరిశోధక విద్యార్థి జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు. పితాని ప్రసాద్, సాహితీవేత్తలు, భాషాభిమానులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అంతర్జాతీయ విద్యార్థి వివేక్ కవిత చదవగా, కే. రత్నం ఆహ్వానం పలికారు. ఎస్. డానియల్ వందన సమర్పణ చేశారు.

## సాయి కృష్ణ నేత్రాలయ డాక్టర్ కృష్ణమోహన్ జింక గారి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షా శిబిరానికి విశేష స్పందన



శ్రీ సత్యసాయి జిల్లా : పెనుగొండ : ప్రతినిధి సురేష్ : ఆగస్టు 27 : పరిగి మండలం పి. నరసాపురం పంచాయతీ సచివాలయంలో పరిసర ప్రాంత ప్రజలకు గురువారం డాక్టర్ కృష్ణమోహన్ జింక గారి ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం నిర్వహించడం జరిగింది.డాక్టర్ కృష్ణమోహన్ జింకా గారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి 30 మంది పరిసర ప్రాంత ప్రజలు హాజరవడం జరిగింది. ప్రముఖ వైద్యులు డాక్టర్ కృష్ణమోహన్ జింకా పాల్గొని ప్రజలకు ఉచిత కంటి వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే. సతీష్ కుమార్ ఎక్స్ కౌన్సిలర్ ఎంఆర్పిఎస్ తాలూకా అధ్యక్షులు, ఐ క్యాంప్ ఇంచార్జ్ ఏ నాగరాజు,సి.ఆర్ ఎక్స్ మండల కన్వీనర్ గోవిందరెడ్డి, కే.గోవిందప్ప పంచాయతీ కన్వీనర్,కే.తిరుమలేష్ మండల జనరల్ సెక్రెటరీ, కొత్తపల్లి నారాయణరెడ్డి, బీరేపల్లి నాగరాజు, ఫీల్డ్ మ్యాన్ నరసప్ప తదితర నాయకులు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

## ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా నిర్వహించాలి...



జగిత్యాల జిల్లా/ రాయికల్ ఆగష్టు 27,: గురువారం రాయికల్ పట్టణంలో సర్ ముసాయిదా వార్డు సభ లో పాల్గొన్న జిల్లా అదనపు కలెక్టర్ బి. ఎస్ లత .ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ బి. ఎస్ లత మాట్లాడుతూ గ్రామసభల ద్వారా ఓటర్ల జాబితా వివరాలను ప్రజలకు చదివి వినిపించి, పారదర్శకంగా పరిశీలన చేపడుతున్నామని తెలిపారు. ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా తరలివెళ్లిన, మరణించిన ఓటర్ల వివరాలను సంబంధిత ఆధారాలతో నిర్ధారించిన అనంతరం నిబంధనల ప్రకారం జాబితా నుంచి తొలగించే ప్రక్రియ చేపడుతున్నట్లు చెప్పారు. ఈ వివరాలపై ప్రజల నుంచి అభ్యంతరాలు ఉన్నట్లయితే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. 2002 నాటి ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ కాని ఓటర్లకు నోటీసులు జారీ చేస్తున్నామని తెలిపారు. సంబంధిత నోటీసులు వారం రోజుల్లో ఓటర్ల ఇళ్లకు చేరుతాయని, నోటీసులు అందుకున్న వారు అందులో పేర్కొన్న గడువులోగా అవసరమైన ఆధారాలను సంబంధిత బిఎల్ఓ లకు సమర్పించాలని సూచించారు. అదేవిధంగా ఓటర్ల డేటాలో గుర్తించిన అసాధారణతలు ఉన్న వారికి కూడా నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పుట్టిన తేదీల్లో తప్పులు, కుటుంబ సభ్యుల మధ్య వయస్సుకు సంబంధించిన అసాధారణ వ్యత్యాసాలు, వంటి డేటా లోపాలను పరిశీలిస్తున్నామని చెప్పారు. సంబంధిత ఓటర్లు సరైన ఆధారాలను సమర్పించి తమ వివరాలను సరిచేసుకోవాలని సూచించారు. గ్రామసభల ముఖ్య ఉద్దేశం తొలగించబోయే ఓట్ల వివరాలను ప్రజలకు ముందుగానే తెలియజేసి, వారికి అభ్యంతరాలు వ్యక్తం చేసే అవకాశం కల్పించడం, తద్వారా ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడమేనని స్పష్టం చేశారు. ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని, తమ పేరు లేదా కుటుంబ సభ్యుల పేర్లకు సంబంధించి ఏవైనా సందేహాలు, అభ్యంతరాలు ఉంటే వెంటనే సంబంధిత బిఎల్ఓను సంప్రదించాలని కోరారు. నోటీసులు అందుకున్న వారు నిర్ణీత గడువులోగా స్పందించి అవసరమైన ఆధారాలను సమర్పించాలని సూచించారు. బిఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి నోటీసుల పంపిణీ, ఆధారాల స్వీకరణ, వివరాల పరిశీలన తదితర ప్రక్రియలను నిబంధనల ప్రకారం చేపట్టాలని, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలు అధికారులకు సహకరించి, తమ ఓటు హక్కు వివరాలను సక్రమంగా నిర్ధారించుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగార్జున, ఎంపిడివో, బి ఎల్ వో లు, స్థానిక ప్రజా ప్రతినిధులు, ప్రజలు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఎంవీపీ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసి, కేసుల దర్యాప్తు పురోగతిపై అభినందన



విశాఖపట్నం, ఆగస్టు -27 జిల్లా ఇంచార్జ్: డీసీపీ క్రైమ్స్ శ్రీమతి లతా మాధురి, ఐపీఎస్ ఈరోజు ఎంవీపీ క్రైమ్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని వివిధ రికార్డులు, ఫైళ్లు, కేసు డైరీలను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీటీఎన్ఎస్‌లో నమోదైన వివరాలను అడిగి తెలుసుకుని, కేసుల దర్యాప్తు పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమై వారి సంక్షేమం, విధి నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. కేసులను త్వరితగతిన ఛేదించి, నేరస్తులను పట్టుకోవడంలో ఎంవీపీ క్రైమ్ పోలీస్ స్టేషన్ సిబ్బంది చక్కని సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ, అధునాతన పద్ధతులను అనుసరిస్తూ సమర్థవంతంగా పనిచేస్తున్నారని డీసీపీ క్రైమ్స్ లతా మాధురి, ఐపీఎస్ ప్రశంసించారు. పోలీస్ స్టేషన్‌లో నిర్వహించాల్సిన ఫైళ్లు, రికార్డులు అన్నీ సక్రమంగా నిర్వహిస్తున్నారని అభినందించారు. ఇదే విధంగా సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయటం ఎల్ హెచ్ ఎం ఎస్ యాప్ పైన అవగాహన కల్పించడం త్వరితగతంగా కేసులు సేదించడంలో తగిన సూచనలిస్తూ ప్రజలకు మెరుగైన అవగాహన అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ తనిఖీల కార్యక్రమంలో ద్వారక సబ్ డివిజన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వి. చక్రధరరావు, ఎంవీపీ పోలీస్ స్టేషన్ క్రైమ్ ఎస్ఐ ఎస్. రాజు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

APTEL/20/A4813
శ్రీ వార్త
జాతీయ తెలుగు దినపత్రిక
కొత్త ఆలోచన.. కొత్త వార్త



# రోజు రోజుకీ తీవ్రతరమవుతున్న ఎండలు.. జాగ్రత్తలు తప్పనిసరి అంటున్న వైద్యులు..



ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. భారత వాతావరణ శాఖ ఇప్పటికే హీట్‌వేవ్ హెచ్చరికలు జారీ చేయగా, ఉష్ణోగ్రతలు 44 నుంచి 46 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదవుతున్నాయి. ఈ తీవ్రమైన వేడి ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, బయట పనులు చేసే కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రుల్లో కూడా వేడి కారణంగా వచ్చే అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నట్లు వైద్య వర్గాలు చెబుతున్నాయి. గత కొన్ని వారాలుగా ఆసుపత్రుల ఔట్‌పేషెంట్ విభాగాలు, అత్యవసర విభాగాలకు డీహైడ్రేషన్, హీట్ ఎగ్జాషన్, హీట్ స్ట్రోక్ ప్రారంభ లక్షణాలతో బాధపడుతున్న రోగులు అధికంగా వస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఎండ తీవ్రత కొనసాగితే ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

### వీరిలో సమస్యలు అధికం..

మధ్యతరహా నుంచి పెద్ద ఆసుపత్రుల వరకు ప్రతిరోజూ సుమారు 10 నుంచి 15 మంది వరకు వేడి సంబంధిత సమస్యలతో చికిత్స కోసం వస్తున్నారని సమాచారం. ముఖ్యంగా వరుసగా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే రోజులలో కేసులు మరింత పెరుగుతున్నాయని చెబుతున్నారు. వీరిలో కొంతమందిని ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందించాల్సి వస్తోంది. 60 ఏళ్లు దాటిన వృద్ధులు, డయాబెటిస్ లేదా గుండె సంబంధిత వ్యాధులతో బాధపడేవారు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. అలాగే 20 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన బయటి పనులు చేసే కార్మికులు కూడా హీట్‌వేవ్ కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నారులు తగినంత నీరు తాగకపోవడం, పూర్తిగా సంరక్షకులపై ఆధారపడటం వల్ల ప్రమాదానికి గురవుతున్నారని నిపుణులు చెబుతున్నారు. పురుషులు ఎక్కువసేపు బయట పనులు చేయడం వల్ల వారిలో ఈ సమస్యలు అధికంగా కనిపిస్తున్నాయి.

### ఈ లక్షణాలు కనిపిస్తే..

వేడి కారణంగా సాధారణంగా డీహైడ్రేషన్, బలహీనత, తల తిరగడం, తలనొప్పి, వాంతుల భావన, కండరాల నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తున్నాయి. పరిస్థితి తీవ్రమైతే గందరగోళం, స్పృహ కోల్పోవడం వంటి హీట్ స్ట్రోక్ లక్షణాలు కూడా కనిపిస్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇక చర్మ సంబంధిత సమస్యలు కూడా అధికమవుతున్నాయి. చెమట ఎక్కువగా పట్టడం వల్ల హీట్ రాషెస్, సన్‌బర్న్, చర్మంపై మంటలు, పుండ్లు వంటి సమస్యలు ఎక్కువగా నమోదవుతున్నాయి. ముఖ్యంగా పిల్లలు, బయట ఎక్కువసేపు పనిచేసేవారిలో ఇవి సాధారణంగా కనిపిస్తున్నాయి.

### ఈ సూచనలు పాటించాలి..

వేడి నుంచి రక్షణ పొందాలంటే తగినంత నీరు, ఎలక్ట్రోలైట్ పానీయాలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎండలో ఎక్కువసేపు తిరగకుండా ఉండటం మంచిదని చెబుతున్నారు. పలుచని, సడలిన కాటన్ దుస్తులు ధరించడం, టోపీలు, గొడుగులు ఉపయోగించడం, సన్‌స్క్రీన్ వాడటం అవసరమని సూచిస్తున్నారు. అలాగే మద్యం, అధిక కాఫీ తీసుకోవడం తగ్గించాలి. ఇళ్లలో సరైన గాలి ప్రసరణ ఉండేలా చూసుకోవాలి. వృద్ధులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని ప్రత్యేకంగా గమనిస్తూ, ఏవైనా లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా ప్రమాదాలను తగ్గించుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.



# చిన్నారుల్లోనూ వస్తున్న ఫ్యాటీ లివర్ సమస్య.. ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త అంటున్న వైద్యులు..



పిల్లల్లో ఫ్యాటీ లివర్ సమస్య గత కొన్నేళ్లుగా ఆందోళనకరంగా పెరుగుతోంది. ఒకప్పుడు పెద్దవారిలో మాత్రమే కనిపించిన ఈ సమస్య ఇప్పుడు చిన్నారుల్లో కూడా నమోదవుతుండటం వైద్య నిపుణులను కలవరపెడుతోంది. అధికంగా జంక్ ఫుడ్ తీసుకోవడం, గంటల కొద్దీ మొబైల్ లేదా టీవీ ముందు గడపడం, శారీరక శ్రమ తగ్గిపోవడం, బాల్యంలోనే ఊబకాయం పెరగడం వంటి అంశాలు దీనికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. కాలేయంలో కొవ్వు పేరుకుపోవడం వల్ల ప్రారంభమయ్యే ఈ సమస్యను తొలిదశలోనే గుర్తిస్తే జీవనశైలిలో మార్పులతో నియంత్రించవచ్చు. అయితే లక్షణాలను నిర్లక్ష్యం చేస్తే కాలేయ నష్టం, సిరోసిస్ వంటి తీవ్రమైన సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంటుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

### కారణం లేకుండానే అలసట..

పిల్లల్లో ఎలాంటి కారణం లేకుండానే తరచూ అలసట కనిపించడం ఫ్యాటీ లివర్‌కు సంకేతం అని అంటున్నారు. పెద్దగా శారీరక శ్రమ చేయకపోయినా పిల్లలు ఎప్పుడూ నీరసంగా ఉండటం, శక్తి తగ్గిపోవడం, సాధారణ పనులకే అలసిపోవడం వంటి లక్షణాలను తల్లిదండ్రులు గమనించాలి. శరీరంలో శక్తి స్థాయిలు తగ్గిపోవడం కాలేయ పనితీరు దెబ్బతినడానికి సూచనగా భావించాలి. చర్మంలో వచ్చే కొన్ని మార్పులు కూడా ఫ్యాటీ లివర్ ప్రమాదాన్ని సూచిస్తాయి. ముఖ్యంగా మెడ చుట్టూ నల్లని మచ్చలు కనిపించడం, చర్మం కాంతి కోల్పోవడం లేదా అనారోగ్యంగా కనిపించడం వంటి లక్షణాలు ఇన్సులిన్ రెసిస్టెన్స్‌తో పాటు కాలేయ సమస్యలకు సంకేతాలుగా ఉంటాయి. ఇలాంటి మార్పులను తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

### తరచూ జీర్ణ సమస్యలు..

పిల్లలకు తరచూ కడుపు ఉబ్బరం, కుడి వైపు పై భాగంలో స్వల్ప నొప్పి లేదా అసౌకర్యం ఉండటం కూడా ఫ్యాటీ లివర్‌కు సంబంధించిన లక్షణంగా భావించాలి. ముఖ్యంగా ఆహారపు అలవాట్లతో సంబంధం లేకుండా ఈ సమస్య పదేపదే వస్తుంటే జాగ్రత్త అవసరం. కాలేయం ఒత్తిడికి గురైనప్పుడు ఇలాంటి సంకేతాలు కనిపించే అవకాశముంటుంది. నగర ప్రాంతాల్లో పిల్లల్లో ఫ్యాటీ లివర్ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ప్రాసెస్డ్ ఫుడ్, అధిక చక్కెర ఉన్న పదార్థాలు, ఫాస్ట్ ఫుడ్ ఎక్కువగా తీసుకోవడం వల్ల కాలేయ కణాల్లో కొవ్వు పేరుకుపోతుంది. శారీరక చలనం తగ్గిపోవడం వల్ల ఆహారం సరిగా జీర్ణం కాకపోవడం కూడా సమస్యను మరింత పెంచుతోంది. మొబైల్ ఫోన్లు, వీడియో గేమ్స్ కారణంగా పిల్లలు బయట ఆడుకోవడం తగ్గించడంతో ప్రమాదం పెరుగుతోంది.

### అధిక బరువు..

అధిక బరువు లేదా ఊబకాయం ఉన్న పిల్లల్లో ఈ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. కుటుంబంలో మధుమేహం చరిత్ర ఉన్నా ప్రమాదం పెరుగుతుంది. అధిక చక్కెర ఉన్న ఆహారాలను తరచూ తీసుకోవడం, వ్యాయామం లేకపోవడం వంటి అంశాలు కూడా కాలేయంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఫ్యాటీ లివర్‌ను తొలి దశలో గుర్తిస్తే పిల్లల్లో పూర్తిగా నియంత్రించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గ్రేడ్-1 దశలో జీవనశైలిలో మార్పులు తీసుకొస్తే కాలేయ ఆరోగ్యం మెరుగుపడుతుంది. బయట ఆటలను ప్రోత్సహించడం, పండ్లు, కూరగాయలు, సంపూర్ణ ధాన్యాలతో కూడిన ఆహారం ఇవ్వడం, జంక్ ఫుడ్, చక్కెర పానీయాలను తగ్గించడం చాలా ముఖ్యం. క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించడం ద్వారా సమస్యను ముందుగానే గుర్తించవచ్చు. పిల్లల్లో నిరంతర అలసట, చర్మంలో మార్పులు, అకస్మాత్తుగా బరువు పెరగడం లేదా రక్తపరీక్షల్లో అసాధారణ ఫలితాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించడం అవసరం. చిన్న చిన్న జీవనశైలి మార్పులు పిల్లలను దీర్ఘకాలిక కాలేయ సమస్యల నుంచి కాపాడుతాయి.

# ఏఐ సృష్టికర్తకే తప్పని అభద్రతా భావం

కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్న ఓపెన్‌ఏఐ అధినేత సామ్ ఆల్ట్‌మాన్ తన సొంత ఉత్పత్తిపైనే సంచలన వ్యాఖ్యలు చేశారు. యాపిల్ కంప్యూటర్ల (మ్యాక్) కోసం ఓపెన్‌ఏఐ కొత్తగా 'కోడెక్స్' స్టాండలోన్ యాప్‌ను విడుదల చేసిన తరుణంలో ఆయన తన వ్యక్తిగత అనుభవాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఇటీవల కోడెక్స్ టూల్‌ను ఉపయోగించి ఆల్ట్‌మాన్ స్వయంగా ఒక అప్లికేషన్‌ను రూపొందించారు. ఆ ప్రక్రియలో భాగంగా కొన్ని మార్పుల కోసం ఏఐని సలహాలు అడగగా అది ఇచ్చిన ఐడియాలు ఆయన ఊహించిన దానికంటే అద్భుతంగా ఉన్నాయట. ఈ విషయాన్ని ఎక్స్(గతంలో ట్విట్టర్)లో పేర్కొంటూ.. 'ఏఐ ఇచ్చిన ఐడియాలు చూసిన సమయంలో నేను కొంచెం పనికిరాని వాడినని (ఖంవశ్రీవం) భావించాను. అది నన్ను కొంత విచారానికి గురిచేసింది' అని ఆయన నిజాయితీగా ఒప్పుకున్నారు. ఒక ఏఐ సృష్టికర్త తాను చేసిన యాప్ ఇచ్చిన సమాధానం చూసి అభద్రతకు లోనవ్వడం ఇప్పుడు టెక్ వర్గాల్లో చర్చనీయాంశమైంది.




### కోడెక్స్ మాక్ యాప్

ఓపెన్‌ఏఐ విడుదల చేసిన ఈ కొత్త మాక్ యాప్ డెవలపర్ల పనితీరును పూర్తిగా మార్చేయనుంది. దీని ప్రత్యేకతలు గమనిస్తే.. ఒకేసారి ఒక చాట్‌బాట్‌తో కాకుండా సమాంతరంగా ఒకటి కంటే ఎక్కువ ఏఐ ఏజెంట్లతో పని చేయవచ్చు. కోడింగ్ కష్టాలను తగ్గించి డెవలపర్లు తమ ఆలోచనలను సులభంగా అమలు చేసేలా ఈ యాప్ రూపొందించినట్లు చెప్పారు. ఈ ఏఐ ఏజెంట్లు కేవలం సలహాలు ఇవ్వడమే కాకుండా వినియోగదారు తరఫున కోడ్ రాయడం, దాన్ని మెరుగుపరచడం, ఇమేజ్ జనరేషన్ వంటి పనులను కూడా చేయగలవు.

### మార్కెట్‌లో పెరుగుతున్న పోటీ

గత నెలలో దాదాపు ఒక మిలియన్ మంది డెవలపర్లు కోడెక్స్‌ను ఉపయోగించినట్లు ఓపెన్‌ఏఐ వెల్లడించింది. ఆంత్రోపిక్, కర్సర్ వంటి సంస్థల నుంచి గట్టి పోటీ ఎదురవుతున్న నేపథ్యంలో యాపిల్ వినియోగదారుల కోసం ఈ ప్రత్యేక యాప్‌ను తీసుకురావడం వ్యూహాత్మక అడుగుగా కనిపిస్తోంది.

### వినియోగదారులకు బంపర్ ఆఫర్

ప్రస్తుతం కోడెక్స్ సేవలు ఓపెన్‌ఏఐ ప్లస్, ప్రో, ఎంటర్‌ప్రైజ్ సబ్‌స్క్రిప్షన్లు ఉన్నవారికి అందుబాటులో ఉన్నాయి. అయితే ఈ కొత్త యాప్ విడుదల సందర్భంగా ఉచిత వినియోగదారులకు కూడా పరిమిత కాలం పాటు కోడెక్స్ యాక్సెస్‌ను కల్పిస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. అలాగే ఇప్పటికే ఉన్న పెయిడ్ యూజర్లకు రేట్ లిమిట్స్ రెట్టింపు చేసింది.

# 'భారత్-విస్తార్'తో డిజిటల్ అండ!




భారతీయ వ్యవసాయ రంగంలో సాంకేతిక విప్లవానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విడివిడిగా ఉన్న వ్యవసాయ పరిశోధనలను, డేటాను ఏకీకృతం చేస్తూ కృత్రిమ మేధ (ఏఐ) ఆధారంగా రైతులకు నేరుగా సలహాలు అందించేలా 'భారత్-విస్తార్' అనే సరికొత్త డిజిటల్ వ్యవస్థను రూపొందించింది. అగ్రిస్టాక్ పోర్టల్స్, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐకార్) ప్యాకేజీలను ఏఐ సిస్టమ్‌లతో అనుసంధానించడం ద్వారా సాగును మరింత లాభసాటిగా మార్చడమే దీని ప్రధాన లక్ష్యం.

ఏఐ టూల్ ఎందుకు?

ప్రస్తుతం మన దేశంలో అనేక ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు, స్టార్టప్‌లు విత్తన అభివృద్ధి నుంచి సప్లై చైన్ వరకు వేర్వేరు ప్రాజెక్టులపై పనిచేస్తున్నాయి. అయితే ఈ సమాచారం అంతా ఒకే చోట లేకపోవడం వల్ల ఆశించిన ఫలితాలు అందడం లేదు. భారత్-విస్తార్ ద్వారా ఈ వనరులన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొస్తారు. అగ్రిటెక్ స్టార్టప్‌లు, పరిశోధనా సంస్థలు ఉత్పత్తి చేసే భారీ డేటాను ఏఐ విశ్లేషించి రైతులకు అర్థమయ్యేలా వివరిస్తుంది.

### రైతులకు చేకూరే ప్రయోజనాలు

దీని ద్వారా సాధారణ సమాచారం కంటే నిర్దిష్టమైన, ధ్రువీకరించిన శాస్త్రీయ సలహాలు రైతులకు అందనున్నాయి. ఐకార్ శాస్త్రీయ పరిశోధనలను నేరుగా డిజిటల్ రికార్డులతో అనుసంధానించడం ద్వారా పొలంలోని పరిస్థితిని బట్టి సలహాలు అందుతాయి. సంక్లిష్టమైన శాస్త్రీయ డేటాను రైతులకు వారి స్థానిక భాషల్లోనే సులువుగా అర్థమయ్యేలా ఈ ఏఐ టూల్ సర్వీసులు అందిస్తుంది. కరువు, వరదలు లేదా తెగుళ్ల దాడుల గురించి అగ్రిస్టాక్ ద్వారా ముందస్తుగా హెచ్చరికలు అందుతాయి. ఇది కేవలం సమాచారానికే పరిమితం కాకుండా ప్రభుత్వ పథకాల అమలు, రుణాలు అందజేయడం, బీమా సేవలను వేగవంతం చేయడానికి సహాయపడుతుంది.

### ప్రైవేట్ సంస్థలకు భాగస్వామ్యం

ఈ వ్యవస్థ కేవలం ప్రభుత్వానికే పరిమితం కాదు. యూనిఫైడ్ ఫార్మర్ సర్వీస్ ఇంటర్ ఫేస్ (యూఎఫ్ఎస్ఐ), ఏపీఐల ద్వారా ప్రైవేట్ కంపెనీలు, స్టార్టప్‌లు కూడా ఈ ప్లాట్‌ఫారమ్‌తో అనుసంధానం కావచ్చు. దీనివల్ల మార్కెట్ కనెక్షన్లు మెరుగుపడటమే కాకుండా రైతులకు మరిన్ని వినూత్నమైన సేవలు అందుబాటులోకి వస్తాయి.

### డేటా భద్రతకు ప్రాధాన్యం

రైతుల డేటా విషయంలో ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చింది. డేటాపై పూర్తి హక్కు రైతుకే ఉంటుంది. ఐటీ చట్టం, ఆధార్ చట్టం ప్రకారం ఈ సమాచారం భద్రంగా ఉంటుంది. ఏదైనా ప్రైవేట్ సంస్థ రైతు డేటాను యాక్సెస్ చేయాలంటే కచ్చితంగా ఆ రైతు నుంచి ముందస్తు అనుమతి పొందాల్సి ఉంటుంది.

# స్మార్ట్ గ్లాసెస్... సో డేంజర్!

అ త నం పెట్టుకున్న స్మార్ట్‌గ్లాసెస్ కేవలం గ్లాసెస్ మాత్రమే కాదు. అందులో కెమెరా కూడా ఉంటుంది. యూఎస్, యూకేలలో 'స్మార్ట్ గ్లాసెస్ బాధితులు' ఎంతోమంది ఉన్నారు. సాంకేతికతలో మరో ముందుడుగుగా 'స్మార్ట్ గ్లాసెస్' వచ్చాయి. హ్యాండ్స్--ఫ్రీ సెల్ఫీలు, ఇన్‌స్టంట్ ట్రాన్సాక్షన్స్, వాయిస్--యాక్టివేటెడ్ అసిస్టెంట్స్‌లాంటి సదుపాయాల మాట ఎలా ఉన్నా కొన్ని సందర్భాలలో ఇవి మహిళల పాలిట పీడకలగా మారుతున్నాయి.

### ఉమెన్ సేఫ్టీ

సరికొత్త సాంకేతికతలో స్మార్ట్ గ్లాసెస్ ట్రెండ్ ఒకటి. హ్యాండ్స్--ఫ్రీ సెల్ఫీల నుంచి ఇన్‌స్టంట్ ట్రాన్సాక్షన్స్ వరకు స్మార్ట్ గ్లాసెస్ ఉపయోగాలు ఉన్నాయి. ఆ ఉపయోగాల మాట ఎలా ఉన్నా... మహిళల ప్రైవసీకి సంబంధించి స్మార్ట్ గ్లాసెస్ బ్యాడ్ గ్లాసెస్‌గా తయారయ్యాయి. స్మార్ట్‌గ్లాసెస్‌తో మహిళల వీడియోలు తీసి వివిధ సైట్‌లలో అప్‌లోడ్ చేస్తున్నారు. మహిళలకు తెలియకుండా స్మార్ట్‌గ్లాసెస్ కెమెరాతో వీడియోలు తీయడం అనేది యూఎస్, యూకేలలో ప్రమాదకరమైన ట్రెండ్‌గా మారింది... బస్‌స్టాప్‌లో నిలబడినప్పుడో, ఏ షాపింగ్ మాల్‌లోనో ఉన్నప్పుడో స్మార్ట్‌గ్లాసెస్ ధరించిన వ్యక్తి మీ దగ్గరకి వచ్చి... 'హాయ్ అండీ... మిమ్మల్ని ఎక్కడో చూసినట్లుగా ఉంది' అని మాట కలిపి చాలాసేపు మాట్లాడవచ్చు.

చివరికి... 'ఒకరి పోలికలతో ఒకరు ఉండడం సహజమే కదండీ. నేను పొరబడ్డాను...సారీ...' అంటాడు. 'భలేవారండీ, ఈ మాత్రం దానికి సారీ ఎందుకు!' అని మనం అంటాం.

### కట్ చేస్తే...

కొన్ని రోజుల తరువాత మీ వీడియో ఇన్‌స్టాగ్రామ్‌లోనో, టిక్‌టాక్‌లోనో కనిపించవచ్చు. షాక్‌కు గురి చేయవచ్చు. అభ్యంతరకరమైన సైట్స్‌లోనూ కనిపించి మిమ్మల్ని ఆందోళనకు గురి చేయవచ్చు. 'అసలు.. నా వీడియో ఈ సైట్‌లోకి ఎలా వచ్చింది!' అని ఆలోచిస్తుండగా మీతో మాట్లాడిన వ్యక్తి గుర్తుకు వస్తాడు. 'నాతో మాట్లాడింది నిజమేగానీ. అతడి చేతిలో సెల్‌ఫోన్‌లాంటిదేమీ కనిపించలేదే!' అని అతడికి క్లీన్ సర్టిఫికెట్ ఇస్తారు. నిజానికి ఆ వీడియో సృష్టికర్త అతడే!

### భయపడవద్దు

గత నెల ఇంగ్లాండ్‌లో ఓ నలభై ఏడేళ్ల మహిళ ఒక వ్యక్తిని కోర్టుకు లాగింది. ఇంతకీ ఆ వ్యక్తి చేసిన నేరం ఏమిటి? ఒక హోటల్లో ఆమెకు తెలియకుండా తన స్మార్ట్‌గ్లాసెస్‌తో అభ్యంతరకరమైన రీతిలో వీడియో తీయడానికి ప్రయత్నిస్తుంటే ఆమెకు అనుమానం వచ్చి, అతడిపై పోలీసులకు ఫిర్యాదు చేసి కోర్టుకు లాగింది. కొద్దిమంది బాధితులు మాత్రం 'నలుగురికి తెలిస్తే పరువు పోతుంది' అనుకుంటూ బ్లాక్‌మెయిల్ చేసే వారి బెదిరింపులకు లొంగిపోతున్నారు. వారు ఎంత డిమాండ్ చేస్తే అంత సొమ్ము ఇచ్చేస్తున్నారు. సూపర్ మార్కెట్‌కు వెళ్లిన తనను అపరిచితుడు ఎవరో రే--బాన్ మెటా స్మార్ట్ గ్లాసెస్‌తో అభ్యంతర కరమైన రీతిలో వీడియో తీశాడని ఒక మహిళ ఆన్‌లైన్‌లో కన్నీరు మున్నీరు అయింది. 'ఎవరో చేసిన దుర్మార్గమైన పనికి మానసికంగానే కాదు, శారీరకంగా కూడా బలహీన పడిపోయాను' అని 'ఎక్స్'లో చేసిన పోస్ట్‌లో వెల్లడించింది ఆ బాధిత మహిళ.



### ఆ లైట్ వెలగక పోవచ్చు కూడా!

స్మార్ట్‌ఫోన్ కెమెరా తో ఎవరైనా షూట్ చేస్తుంటే వెంటనే గమనించి అడ్డుకోవచ్చు. అయితే స్మార్ట్ గ్లాసెస్‌తో రికార్డ్ చేస్తున్న విషయం తెలియకపోవడం వల్ల ప్రమాదాన్ని పసిగట్టలేము. స్మార్ట్ గ్లాసెస్ విషయానికి వస్తే, ఉదాహరణకు మెటా ప్రొడక్ట్ రే--బాన్ స్మార్ట్ గ్లాసెస్‌ను తీసుకుంటే...రికార్డింగ్ చేస్తున్నప్పుడు గ్లాసెస్‌లోని తెల్లటి చిన్న ఎల్ఈడి ఇండికేటర్ వెలుగుతుంది. ఈ లైట్ ఆధారంగా వీడియో రికార్డింగ్ జరుగుతున్న విషయం తెలుసుకోవచ్చు. అయితే ఈ లైట్ పగటి వెలుగులో, ప్రకాశవంతమైన పరిసరాలలో అంతగా కనిపించదు. కొందరు ఈ లైట్ కనిపించకుండా కూడా మ్యానేజ్ చేస్తున్నారు. కొన్ని గ్లాసెస్‌కు రికార్డింగ్ ఇండికేటర్ లేకపోవడం వల్ల అక్రమంగా వీడియో తీస్తున్నవారి పని మరింత సులువు అవుతుంది. ముఖ్యంగా తక్కువ ధరల్లో వచ్చే చైనీస్ మోడల్స్‌లో ఈ ఫీచర్ కనిపించడం లేదు. స్మార్ట్ గ్లాసెస్‌లోని ఎల్ఈడి లైట్ ఎందుకు వెలుగుతుందనేది చాలామందికి తెలియక పోవడం వల్ల అనుమానం రావడం లేదు. యూఎస్, యూకేలలో ప్రైవసీ చట్టాలు రకరకాలుగా ఉన్నాయి. కొన్ని ప్రాంతాలలో బహిరంగ ప్రదేశాలలో వీడియోలు తీయడం నేరం కాదు. మనకు తెలియకుండానే కేఫ్, మెట్రోస్టేషన్, పార్క్, ఆలయం సమీపంలో ఎవరైనా వీడియో షూట్ చేసి ఉండవచ్చు. ఆ వీడియోలో మనం ఉన్నామా లేదా అని తెలుసుకోవడానికి, ఫుటేజి తీసివేయాలని డిమాండ్ చేయడానికి చట్టపరమైన అధికారం లేదు. అయితే ఇతరులు అభ్యంతరం చెప్పినప్పుడు రికార్డింగ్ నిలిపివేయాలని టెక్ కంపెనీలు చెప్పవచ్చు. యూఎస్, యూకేలలోనే కాదు మన దేశంలోనూ స్మార్ట్‌గ్లాసెస్ దుర్వినియోగానికి సంబంధించిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి.

### పరిష్కారం లేదా?

'అవగాహన, అప్రమత్తతే సమస్యకు పరిష్కారం' అంటున్నారు టెక్ నిపుణులు. 'సందేహంతో ఉండాలి. అప్రమత్తంగా ఉండాలి. అనుమానంగా అనిపిస్తే సమాచారం ఇవ్వాలి' అని కూడా చెబుతున్నారు. కెమెరాలు ఉన్న అన్ని స్మార్ట్‌గ్లాసులలోనూ స్పష్టమైన లైట్లు, సంకేతాలు ఉండవనే విషయం తెలుసుకోవాలి.

### డేంజర్ ట్రెండ్!

యూఎస్. యూకేలలో స్మార్ట్ గ్లాసెస్ కెమెరాలను ఉపయోగించి మహిళలకు తెలియకుండా వారి వీడియోలు తీసి. వివిధ సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేయడం అనేది ప్రమాదకరమైన ధోరణిగా మారింది. వీడియో ఫుటేజీని సైకలాజికల్ మేనిప్యులేషన్ కోసం ఉపయోగించే ప్రమాదకరమైన ధోరణి పెరిగింది. 'నాకు తెలియకుండానే నా వీడియోను చిత్రీకరించి, ఏదో సైట్‌లో పోస్ట్ చేశారు. ఆ తరువాత నేను పడిన ఇబ్బందులు ఇన్నీ అన్నీ కావు. ఎంత దారుణం ఇది!' అంటూ న్యూయార్క్‌లో ఉండే కెసీ జనంజని కళ్లనీళ్ల పర్యంతం అయింది. 'ఈ పని వారు యాదృచ్ఛికంగా, సరదా కోసం చేశారనుకోవడం లేదు. విషపూరిత ఆలోచనలతోనే చేస్తున్నారు' అంటుంది కెసీ.

శ్రీ వార్త — జాతీయ తెలుగు దినపత్రిక
శుక్రవారం - 28 - ఆగస్టు - 2026

# మన శరీరంలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉందని ఎలా గుర్తించాలి..? ఇమ్యూనిటీ పవర్ తగ్గితే కనిపించే లక్షణాలు ఏమిటి..?



సీజన్లు మారినప్పుడు, వాతావరణం మరీ చల్లగా ఉన్నప్పుడు, లేదా ఒకరి నుంచి మరొకరికి పలు వ్యాధులు వ్యాప్తి చెందుతుంటాయి. దగ్గు, జలుబు ఫ్లూ వంటివి ఈ కోవకు చెందుతాయి. ఈ క్రమంలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఇవి త్వరగా వస్తాయి. రోజుల తరబడి అలాగే ఉంటాయి. ఒకవేళ తగ్గినా కొన్ని రోజులకు మళ్లీ వస్తుంటాయి. అయితే రోగాలు రాకుండా ఉండేందుకు గాను రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉండడం అవసరం. రోగ నిరోధక శక్తి తగినంతగా లేకపోతే తరచూ రోగాల బారిన పడాల్సి ఉంటుంది. కరోనా సమయంలోనూ ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారిపైనే వైరస్ ఎక్కువగా ప్రభావం చూపించింది. అందువల్ల రోగ నిరోధక శక్తిని పెంచుకోవాల్సిన అవసరం ఏర్పడింది. అయితే ఎవరిలో అయినా సరే రోగ నిరోధక శక్తి తక్కువగా ఉందని ఎలా తెలుస్తుంది..? రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలంటే ఏం చేయాలి..? వంటి విషయాలను వైద్యులు వెల్లడిస్తున్నారు.

### తరచూ దగ్గు, జలుబు, జ్వరం..

రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటే అలాంటి వారికి తరచూ దగ్గు, జలుబు, జ్వరం వస్తుంటాయి. ఒక పట్టాన తగ్గవు. తగ్గినా మళ్లీ మళ్లీ వస్తాయి. తరచూ ఏదో ఒక అనారోగ్య సమస్య ఇబ్బందులకు గురి చేస్తుంది. అలాగే రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటే తీవ్రమైన ఒత్తిడి బారిన పడతారు. ఎవరైనా ఒత్తిడిని అధికంగా ఎదుర్కొంటున్నట్లయితే వారిలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుందని భావించాలి. ఒత్తిడి లేదా డిప్రెషన్ అధికంగా ఉన్నవారిలో రోగ నిరోధక శక్తి క్రమంగా తగ్గుతుంది. దీంతో వారు తరచూ సీజనల్ వ్యాధుల బారిన పడుతుంటారు. తరచూ జీర్ణ సమస్యలు వస్తున్నా కూడా రోగ నిరోధక శక్తి తక్కువగా ఉందని భావించాలి. ముఖ్యంగా ఇలాంటి వారికి పొట్టలో ఎల్లప్పుడూ అసౌకర్యంగా ఉంటుంది. తిన్న వెంటనే విరేచనానికి వెళ్లాల్సిన అవసరం ఏర్పడుతుంది. ఈ సమస్యలు కూడా రోగ నిరోధక శక్తి తక్కువగా ఉందని తెలియజేస్తాయి.

### గాయాలు, పుండ్లు మానడం..

రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటే గాయాలు, పుండ్లు మానడం కూడా ఆలస్యం అవుతుంది. సాధారణంగా డయాబెటిస్ ఉన్నవారికి ఇలా జరుగుతుంది. కానీ మీకు డయాబెటిస్ లేకపోయినా గాయాలు, పుండ్లు ఆలస్యంగా మానుతున్నాయంటే మీలో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉందని అర్థం చేసుకోవాలి. అలాగే ఇమ్యూనిటీ పవర్ తక్కువగా ఉంటే తరచూ ఇన్‌ఫెక్షన్ల బారిన పడుతుంటారు. ముఖ్యంగా చర్మ ఇన్‌ఫెక్షన్లు లేదా బ్యాక్టీరియా, వైరస్ ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. ఇవి రోగాలను కలగజేస్తాయి. ముఖ్యంగా తరచూ జ్వరం వస్తుంది. ఇవన్నీ ఇమ్యూనిటీ తక్కువగా ఉందనే విషయాన్ని తెలియజేస్తాయి. అలాగే ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారు అసలు ఏ పనిచేయకపోయినా తీవ్రంగా అలసిపోయినట్లు ఫీలవుతారు. తీవ్రమైన అలసట, నీరసం ఉంటాయి. ఇలా ఇమ్యూనిటీ తక్కువగా ఉన్న విషయాన్ని సులభంగా గుర్తించవచ్చు. అయితే కొన్ని రకాల ఆహారాలను రోజూ తీసుకుంటే ఈ సమస్య నుంచి సులభంగా బయట పడవచ్చు.

### ఈ ఆహారాలను తినాలి..

సిట్రస్ జాతికి చెందిన నిమ్మ, నారింజ వంటి పండ్లను రోజూ తింటుంటే ఇమ్యూనిటీ అధికంగా పెరుగుతుంది. వీటిల్లో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. అలాగే జింక్ అధికంగా ఉండే చేపలు, రొయ్యలు, చికెన్, మటన్, మటన్ లివర్, పప్పు దినుసులు, గుమ్మడి విత్తనాలు, నువ్వులు, అవిసె గింజలు, చియా విత్తనాలు, బాదంపప్పు, జీడిపప్పు, వాల్ నట్స్‌ను తింటున్నా కూడా రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. రోజూ రాత్రి పూట పసుపును పాలలో కలిపి తాగుతుంటే ఉపయోగం ఉంటుంది. రాత్రి పూట భోజనం చేసిన తరువాత దాల్చిన చెక్క వేసి మరిగించిన నీళ్లను తాగవచ్చు. లేదా రెండు లవంగాలను నోట్లో వేసుకుని నమిలి తినవచ్చు. భోజనానికి ముందు ఒక టీస్పూన్ అల్లం రసాన్ని రోజుకు 2 సార్లు సేవిస్తుండాలి. చేపలను వారంలో కనీసం రెండు సార్లు తినాలి. ఇలా ఆయా ఆహారాలను తీసుకోవడం వల్ల ఇమ్యూనిటీని సులభంగా పెంచుకోవచ్చు. ఆరోగ్యంగా ఉండవచ్చు.

# రోజంతా గంటల తరబడి కూర్చుని పనిచేసేవారికి అలర్ట్.. ఈ సమస్యలు వచ్చే ప్రమాదం అధికం..

ఆధునిక జీవనశైలిలో రోజుకు 8 గంటలకు పైగా కూర్చునే అలవాటు చాలా మందికి సాధారణంగా మారిపోయింది. ఆఫీసులో కంప్యూటర్ ముందు పని చేయడం, ట్రాఫిక్‌లో ఎక్కువసేపు డ్రైవింగ్ చేయడం లేదా ఇంటికి వచ్చాక కూడా మొబైల్, టీవీల ఎదుట గంటల తరబడి కూర్చోవడం వల్ల శరీరంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ముఖ్యంగా కాళ్లలో రక్త ప్రసరణ దెబ్బతిని, భవిష్యత్తులో రక్తనాళాల సమస్యలకు దారితీసే ప్రమాదం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. శరీరం సహజంగా కదలికల కోసం నిర్మాణమైందని, కానీ ఎక్కువసేపు కూర్చోవడం వల్ల కాళ్ల కండరాలు పనిచేయకుండా పోతాయని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా కాళ్ల కండరాల కదలికలే రక్తాన్ని తిరిగి గుండె వైపు పంపించడంలో సహాయపడతాయి. అయితే గంటల తరబడి కూర్చుంటే ఈ ప్రక్రియ మందగించి రక్తం కాళ్లలోనే నిలిచిపోవడం ప్రారంభమవుతుంది. దీని వల్ల క్రమంగా రక్తనాళాల పనితీరు దెబ్బతింటుందని పేర్కొంటున్నారు.

### వాపులు రావడం..

కాళ్లలో రక్త ప్రసరణ సరిగా లేకపోతే మొదట కనిపించే ముఖ్య లక్షణాల్లో ఒకటి మడమలు, పాదాలు, కాళ్ల దిగువ భాగంలో వాపు రావడం. దీన్ని పెరిఫెరల్ ఎడిమా అని పిలుస్తారు. ఎక్కువసేపు కూర్చోవడం వల్ల రక్తం కాళ్లలో నిలిచిపోవడంతో ద్రవం చర్మ కణజాలాల్లోకి చేరి వాపులకు కారణమవుతుంది. రోజు ముగిసే సమయానికి చెప్పులు బిగుతుగా అనిపించడం లేదా సాక్స్ తీసేసిన తర్వాత మడమల వద్ద గాట్లు కనిపించడం ఈ సమస్యకు సంకేతాలుగా చెప్పవచ్చు. అలాగే స్పైడర్ వీన్స్, వెరికోస్ వీన్స్ కనిపించడం కూడా ఇంకో ముఖ్య హెచ్చరిక సంకేతంగా చెప్పవచ్చు. సాధారణంగా రక్తనాళాల్లో ఉండే చిన్న వాల్వులు రక్తం వెనక్కి వెళ్లకుండా అడ్డుకుంటాయి. కానీ ఎక్కువసేపు కూర్చోవడం వల్ల కాళ్లలో ఒత్తిడి పెరిగి ఈ వాల్వులు బలహీనపడతాయి. ఫలితంగా చర్మం కింద ఎరుపు, నీలం లేదా ఊదా రంగులో సన్నని రక్తనాళాలు కనిపించడం ప్రారంభమవుతుంది. మరింత తీవ్రమైతే పెద్దగా వాపులకు గురై, మెలికలు తిరిగిన నీలి రంగు రక్తనాళాలు బయటకు కనిపిస్తాయి. ఇవి కేవలం అందానికి సంబంధించిన సమస్యలే కాకుండా రక్త ప్రసరణలో లోపానికి సంకేతాలని వైద్యులు చెబుతున్నారు.



### డీప్ వెయిన్ థ్రాంబోసిస్..

చాలాసేపు కూర్చున్న తర్వాత కాళ్లలో చిమ్మటలు రావడం, నిస్సత్తువగా అనిపించడం లేదా సూదులతో గుచ్చినట్లుగా అనిపించడం కూడా ప్రమాద సూచికలుగా చెబుతున్నారు. రక్త ప్రసరణ తగ్గిపోవడంతో నరాలకు సరైన ఆక్సిజన్, పోషకాలు అందక ఈ సమస్యలు వస్తాయి. ముఖ్యంగా కాళ్లు ముడుచుకుని కూర్చోవడం లేదా సరైన కుర్చీలు ఉపయోగించకపోవడం వల్ల నరాలపై ఒత్తిడి పెరిగి పరిస్థితి మరింత తీవ్రమవుతుంది. ఎక్కువసేపు కదలకుండా ఉండటం వల్ల వచ్చే అత్యంత ప్రమాదకర పరిస్థితి డీప్ వెయిన్ థ్రాంబోసిస్ (ఐఖ). కాళ్ల లోతైన రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం వల్ల ఈ సమస్య వస్తుంది. ఆ గడ్డ రక్తప్రసరణ ద్వారా ఊపిరితిత్తులకు చేరితే ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంటుంది. కాబట్టి ఎక్కువసేపు కూర్చునే ఉద్యోగాలు చేసే వారు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాలి.

### చిన్న చిన్న అలవాట్లే..

ఈ సమస్యలను నివారించడానికి చిన్న చిన్న అలవాట్లే చాలనని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి 30 నుంచి 60 నిమిషాలకు ఒకసారి లేచి నడవడం, స్ట్రెచింగ్ చేయడం, కాళ్ల వ్యాయామాలు చేయడం మంచిది. కూర్చునేటప్పుడు రెండు కాళ్లను నేలపై సరిగా ఉంచడం, కాళ్లు మడవకుండా ఉండడం, రోజులో కొంతసేపు కాళ్లను గుండె స్థాయి కంటే ఎత్తుగా పెట్టుకుని విశ్రాంతి తీసుకోవడం ద్వారా రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. రోజంతా కుర్చీలో కూర్చోవడం తప్పనిసరి అయినా, కాళ్ల ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. చిన్న లక్షణాలను ముందుగానే గుర్తిస్తే భవిష్యత్తులో తీవ్రమైన రక్తనాళాల సమస్యలను నివారించవచ్చు.

# ఈ-స్కూటర్లకు హోండా గుడ్‌బై!



న్యూఢిల్లీ, నవంబర్ 22:యాక్టివా ఎలక్ట్రిక్ స్కూటర్‌కు హోండా గుడ్‌బై పలుకబోతున్నదా అంటే ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇది నిజమేననిపిస్తున్నది. ఎంతో ఆర్భాటంగా దేశీయ మార్కెట్లో ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేసిన జపాన్ వాహన సంస్థ హోండా..ఈ స్కూటర్‌కు డిమాండ్ బాగానే ఉన్నప్పటికీ గడిచిన నాలుగు నెలలుగా ఉత్పత్తిని నిలిపివేసినట్టు తెలుస్తున్నది. దేశీయ ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈ విషయం బట్టబయలు అయింది. ఈ ఏడాది ఆగస్టు నెల నుంచి ఇప్పటి వరకు ఉత్పత్తిని నిలిపివేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి జూలై వరకు ఆరు నెలలపాటు 11,168 యూనిట్ల ఎలక్ట్రిక్ యాక్టివా ఈ, క్యూసీఐ మాడళ్లను ఉత్పత్తి చేసింది. వీటిలో సగం 5,201 యూనిట్లను డీలర్లకు డెలివరీ చేసింది. విక్రయాలు ఆ స్థాయిలో లేకపోవడంతో ఉత్పత్తిని నిలిపివేసినట్టు తెలుస్తున్నది. ఈ 5,201 యూనిట్లలో 4,461 యూనిట్లు క్యూసీఐ మాడల్ కాగా, మిగతా 740 యాక్టివా ఈ మాడల్ మాత్రమే. తన బ్రాండ్ నుంచి తొలి ఈ-స్కూటర్ ఇదే కావడం విశేషం. ప్రస్తుతం హోండా యాక్టివా ఈ స్కూటర్ ధర రూ.1.17 లక్షలు కాగా, క్యూసీ1 మాడల్ ధర రూ.90,022గా నిర్ణయించింది. సింగిల్ చార్జింగ్‌లో 102 కిలోమీటర్ల వరకు ప్రయాణించనున్నది. ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న ఈ స్కూటర్ల ధరల్లో ఇదే తక్కువ అయినప్పటికీ కొనుగోలుదారులు పెద్దగా ఆసక్తి చూపకపోవడం విశేషం. ప్రస్తుతం మార్కెట్లో హోండా స్కూటర్లతోపాటు బజాజ్, టీవీఎస్, ఏథర్, ఓలా, హీరో మోటోకార్ప్‌లు పలు మాడళ్లను విక్రయిస్తున్నాయి.

# మిక్స్‌డ్ వెజిటబుల్ సలాడ్‌ను ఇలా తయారు చేసుకుని రోజూ తినండి.. ఎన్నో అద్భుతమైన లాభాలను పొందవచ్చు..!

ఆరోగ్యంగా ఉండడం కోసం అనేక మంది రోజూ పౌష్టికాహారాన్ని తింటుంటారు. అన్ని పోషకాలు కలిగి ఉండే ఆహారాలను రోజూ తింటారు. ఈ క్రమంలోనే కూరగాయలు ఇలాంటి ఆహారాల్లో ముందు వరుసలో నిలుస్తాయని చెప్పవచ్చు. కూరగాయలను తాజాగా రోజూ తింటే అనేక లాభాలు కలుగుతాయి. అందుకనే చాలా మంది వెజిటబుల్ సలాడ్ రూపంలో కూరగాయలను తింటారు. అయితే వెజిటబుల్ సలాడ్‌ను ఎలా తయారు చేసుకోవాలి, ఇందులో ఎలాంటి కూరగాయలను ఉపయోగించాలి.. అన్న విషయాలు చాలా మందికి తెలియవు. కానీ దీన్ని చాలా సులభంగా తయారు చేసుకోవచ్చు. పైగా ఇందులో వాడే కూరగాయలు లేదా పదార్థాలు అన్నీ మనకు అందుబాటులో ఉండేవే. ఈ క్రమంలోనే ఇలా వెజిటబుల్ సలాడ్‌ను తయారు చేసి రోజూ తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.



### మిక్స్‌డ్ వెజిటబుల్ సలాడ్ తయారీ ఇలా..

వెజిటబుల్ సలాడ్ తయారీకి గాను 1 టీస్పూన్ ఆలివ్ ఆయిల్, 3 బేబీ కార్న్, 1 లేదా 2 టమాటాలు, 1 గ్రీన్ క్యాప్సికం, 1 పసుపు రంగు క్యాప్సికం, 2 క్యారెట్లు, 8 నుంచి 10 గ్రీన్ బీన్స్, 1 బ్రోకలీని తీసుకోవాల్సి ఉంటుంది. ఇక వెజిటబుల్ సలాడ్‌ను ఎలా తయారు చేయాలంటే.. మొదట బ్రోకలీని వేడి నీటిలో కొంత సమయం ఉడకబెట్టాలి. ఇది బ్రోకలీని మృదువుగా చేస్తుంది. ఇప్పుడు మిగతా కూరగాయలన్నింటినీ కట్ చేసుకోవాలి. ఒక పాన్ తీసుకుని అందులో ఆలివ్ ఆయిల్‌ను వేయాలి. ఆలివ్ ఆయిల్ లేకపోతే వెన్న లేదా నెయ్యిని కూడా ఉపయోగించవచ్చు. అనంతరం అందులో బేబీ కార్న్, అన్ని తరిగిన కూరగాయల ముక్కలను వేయాలి. తరువాత కొంచెం నీరు వేసి సలాడ్ ను తక్కువ మంట మీద ఉడికించాలి. మీరు ఈ సలాడ్‌ను 5 నిమిషాలు మాత్రమే ఉడికించాలి. నీరు చాలా తక్కువగా వేయాలి. నీరు ఆవిరి అయ్యే లోపు కూరగాయలు ఉడుకుతాయి. ఇలా సలాడ్ రెడీ అవుతుంది. అనంతరం అందులో రుచికి అనుగుణంగా ఉప్పు, నల్ల మిరియాల పొడి వేసుకోవాలి. అవసరం అనుకుంటే కాస్త నిమ్మరసం చల్లుకోవచ్చు. దీంతో వెజిటబుల్ సలాడ్ రెడీ అవుతుంది. దీన్ని వేడిగా ఉన్నప్పుడు తినేయాలి. ఈ వెజిటబుల్ సలాడ్‌ను రోజూ తయారు చేసి తింటుంటే అనేక లాభాలు కలుగుతాయి.

### బరువు తగ్గేందుకు..

మిక్స్‌డ్ వెజిటెబుల్ సలాడ్‌లో వివిధ రకాల కూరగాయలు ఉంటాయి. కనుక దీన్ని తినడం ద్వారా మనకు రోజూ అన్ని పోషకాలు లభిస్తాయి. ముఖ్యంగా ఈ సలాడ్‌లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్దకం వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఫైబర్ కారణంగా కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. ఆహారం తక్కువగా తింటారు. దీని వల్ల బరువు తగ్గడం చాలా తేలికవుతుంది. అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారు రోజూ ఈ సలాడ్‌ను తింటుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఈ సలాడ్‌ను తినడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. ఉత్సాహంగా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. నీరసం, అలసట తగ్గుతాయి. బద్దకం పోతుంది. ఉదయం ఈ సలాడ్‌ను తింటే రోజంతా ఉత్సాహంగా పనిచేయవచ్చు.

### మీకు నచ్చిన కూరగాయలతోనూ..

వెజిటబుల్ సలాడ్ వల్ల శరీరంలో ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. శరీరంలోని నీరు అధికంగా బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడవచ్చు. దీంతో డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. ముఖ్యంగా వేడి శరీరం ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. ఇలా ఈ సలాడ్‌తో అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. అయితే మిక్స్‌డ్ వెజిటబుల్ సలాడ్‌లో రోజూ ఒకే కూరగాయలను వాడాలని ఏమీ లేదు. మీకు నచ్చిన కూరగాయలు లేదా ఆకుకూరలతోనూ దీన్ని తయారు చేసుకోవచ్చు. కానీ మరీ అధికంగా ఉడికించకూడదు. అలాగే ఉప్పును మరీ ఎక్కువగా వేయకూడదు. కూరగాయలను పచ్చిగా తింటే సాల్మొనెల్లా బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్ బారిన పడే అవకాశాలు ఉంటాయి. కనుక కాస్త ఉడికించి తింటే మంచిది. దీని వల్ల అనేక పోషకాలను పొంది ఆరోగ్యంగా ఉండవచ్చు.



# నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రమేష్ బాబు



అవనిగడ్డ ఆగస్టు 27 శ్రీ వార్త: అవనిగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలోని 9వ వార్డు కొత్తఎడ్లలంక చెందిన అవనిగడ్డ గ్రామం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం అధ్యక్షులు అలపర్తి వెంకటరమణ(ముసలయ్య) - శ్రీమతి పుణ్యవతి దంపతుల నూతన గృహప్రవేశం సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని ముసలయ్య కి శుభాకాంక్షలు తెలియజేసిన అవనిగడ్డ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింహాద్రి రమేష్ బాబు . ఈ కార్యక్రమంలో అవనిగడ్డ జడ్పీటీసీ మరియు కృష్ణాజిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షులు చింతలపూడి లక్ష్మీనారాయణ(లచ్చి), అవనిగడ్డ నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షులు చింతలపూడి బాల భాస్కరరావు(బాలు), వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యాసం శ్రీనివాసరావు, నలుకుర్తి వెంకటేశ్వరరావు, చింతలపూడి సుబ్రహ్మణ్యం, చింతలపూడి శ్రీనివాసరావు(పిచ్చయ్య), నలుకుర్తి నాగేశ్వరావు, మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రానున్న ఎన్నికలకు అవనిగడ్డ బిజెపి సంసిద్ధం



అవనిగడ్డ ఆగస్టు 27 శ్రీ వార్త : రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో అవనిగడ్డ మండలం లోని పది పంచాయతీలలో మరియు మండల పరిషత్ జిల్లా పరిషత్ ఎన్నికలకు సంసిద్ధులై గురువారం అభ్యర్థులను గుర్తించి సమాయాతం చేస్తున్న సందర్భంలో ఎస్సీ బీసీ మహిళ అభ్యర్థులు ఎవరైనాప్పటికీ గట్టిగా విజయవకాశాలున్న అభ్యర్థులను గుర్తించడం జరుగుతుంది . ఈరోజున భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇస్తున్నటువంటి సంక్షేమ పథకాలు అన్నీ కూడా గ్రామంలో ఇండ్లు గాని సాగునీరు తాగునీరు గాని గ్రామాల నుంచి పొలాలకు రోడ్లు గాని గ్రామాల నుంచి గ్రామాలకు రోడ్లు గాని కులాయి సౌకర్యాలను గాని అంతర్గత రోడ్లు గాని ఉచిత రేషన్ బియ్యం గాని కుంటలు చెరువులు అభివృద్ధి గాని విద్య కోసం స్కూల్ అభివృద్ధి కోసం గానీ ఇవాళ రైతాంగానికి అనేక రకాలుగా సౌకర్యాలు కల్పించడానికి గాని తక్కువ ఖర్చుతో ఎక్కువగా లాభాలు వచ్చేదానికోసం ప్రణాళికలు సిద్ధం చేస్తున్న సందర్భంలో ఇవాళ భారతీయ జనతా పార్టీ ప్రతినిధులుగా గ్రామాల్లో ఉండాల్సిన అవసరం ఉందని ఎవరు అయినప్పటికీ కూడా వాస్తవిక రాజకీయాలు గుర్తించాలి ఈ రోజున ఇతర రాజకీయ పార్టీలు కూడా గమనించండి ఇవాళ రాజకీయాల్లో తిరిగి ఏదో ఊహించుకుంటే ఇవాళ గ్రామాలకు అభివృద్ధి ఏం జరుగుతుందో ఎవరి వల్ల అవుతుందనేది కూడా గమనించాల్సిన అవసరం ఇవాళ అపోహ పడి ఎవరో ఏదో చేస్తారని నమ్మి ప్రలోభాలకు లొంగి వెళ్లాల్సిన అవసరం ఏ ఒక్క ఓటరుకు లేదనేది గుర్తించాలి ఇవాళ తాత్కాలికమైనటువంటి ప్రలోభాలకు లుంగీ అభ్యర్థిగా దూరం జరగద్దని అభిప్రాయం వ్యక్తపరుస్తుండడం జరుగుతుంది ఈ కార్యక్రమం మండల కమిటీ అధ్యక్షుడు శోభిల ఏడుకొండలు, జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట్ర కవులు రైతుల కన్వీనర్ జీవి నగరాయులు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు భోగాది చంద్రశేఖర్, సర్ జిల్లా కన్వీనర్ తుంగల వెంకటగిరి, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి భూపతి సుబ్రమణ్యం,బీజేపీ మండల ఉపాధ్యక్షుడు చన్నగిరి సీతా రామాంజనేయులు,ఎస్ సి నాయకులు మెరుగు రణధీర్, కిసాన్ మోర్చా మండల ఉపాధ్యక్షులు పడమటి సుబ్రహ్మణ్యం,పాల్గొన్నారు.

# రాఘవయ్య భౌతిక కాయానికి నివాళులు



అవనిగడ్డ ఆగస్టు 27 శ్రీ వార్త: అవనిగడ్డ గ్రామ పంచాయతీ పరిధిలోని 3వ వార్డుకు చెందిన అన్నపురెడ్డి సందీప్ తండ్రి అన్నపురెడ్డి రాఘవయ్య , అనారోగ్యం కారణంగా మరణించారు. గురువారం మధ్యాహ్నం వారి స్వగృహం నందు రాఘవయ్య భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసిన అవనిగడ్డ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త మరియు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతు విభాగం రీజనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ సింహాద్రి రమేష్ బాబు ఈ కార్యక్రమంలో అవనిగడ్డ జడ్పీటీసీ మరియు కృష్ణాజిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షులు చింతలపూడి లక్ష్మీనారాయణ(లచ్చి), వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నపురెడ్డి పరమాత్మ మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక వార్డు సభ్యులు, తదితరులు పాల్గొని రాఘవయ్య భౌతిక కాయానికి నివాళులర్పించారు.

# మండలి బుద్ధప్రసాద్ కృషితో తెలుగు శిక్షణ ప్రారంభం

### తెలుగు తలైవా అంటూ మండలి బుద్ధప్రసాద్ కు ధన్యవాదములు తెలిపిన తెలుగు ప్రజలు



అవనిగడ్డ ఆగస్టు 27 శ్రీ వార్త : శ్రీలంకలోని తెలుగు వారి చిరకాల వాంఛ నెరవేరింది. కొలంబోలో ఉన్న అల్ సిలోన్ తెలుగు కాంగ్రెస్ సభ్యులైన శ్రీలంక తెలుగు ప్రజలకు తెలుగు వ్రాయటం, చదవటం నేర్పే కార్యక్రమం ప్రారంభమైంది. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా కొలంబోలోని దాదాపు ఆరు లక్షల మంది తెలుగు ప్రజలకు వారి మాతృభాష తెలుగు నేర్పే బృహత్తర యజ్ఞం మొదలైంది. శ్రీలంక తెలుగు కాంగ్రెస్ ఆహ్వానం మేరకు ఉమ్మడి రాష్ట్ర మాజీ మంత్రి, అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ ఈ ఏడాది జులై నెలలో శ్రీలంకలో పర్యటించారు. తమకు, తమ పిల్లలకు తెలుగు వ్రాయటం, చదవటం నేర్పండి అంటూ శ్రీలంక తెలుగు ప్రజలు ఆయన ముందు వ్యక్తం చేసిన ఆకాంక్షను ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక శ్రద్ధతో సాకారం చేశారు. హైదరాబాద్ సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఉప కులపతి వెలుదండ నిత్యానందరావు, రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు సహకారంతో, శ్రీలంక బుద్ధ శాసన, సాంస్కృతిక వ్యవహారాల శాఖ మంత్రి హినీదుమ సునీల్ సెల్వీ ప్రోత్సాహంతో ఈ ముందడుగు పడింది. గతంలో శ్రీలంకలో పర్యటించి కొలంబోలోని అల్ సిలోన్ తెలుగు కాంగ్రెస్ సభ్యులను కలిసి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసిన జర్నలిస్టులు చామర్తి మురళీధర్, డీపీ అనురాధలకు అక్కడి తెలుగు ప్రజలు తమకు తెలుగు వ్రాయటం, చదవటం నేర్చుకోవాలనే ఆకాంక్ష ఉన్నట్లు చెప్పటంతో వారి సూచన మేరకు, శ్రీలంక తెలుగు కాంగ్రెస్ ఆహ్వానం మేరకు శ్రీలంకలో పర్యటించిన డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ వారి ఆకాంక్ష నెరవేర్చారు. మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక శ్రద్ధతో శ్రీలంకలో తెలుగు వారికి తెలుగు మాట్లాడటం, వ్రాయటం నేర్పేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభించారు. శ్రీలంకలోని తెలుగు ప్రజలకు ఇద్దరు తెలుగు టీచర్లను నియమించి, తద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ వారి కలను సాకారం చేస్తున్నారు. తమ ప్రాంతానికి వచ్చి తమకు తమ మాతృభాషా తెలుగు వ్రాయటం, చదవటం నేర్పే ఏర్పాట్లు చేసిన తెలుగు తలైవా మండలి బుద్ధప్రసాద్ కు ధన్యవాదములు తెలిపారు.

# బ్రహ్మాస్త్రం సిద్ధం!

## 'హూట్ రాకెట్ టార్పెడో' సిద్ధంగా ఉన్నట్లు ఇరాన్ ప్రకటన

## త్వరలోనే శత్రువుపై ప్రయోగిస్తామని వెల్లడి

## సముద్ర గర్భంలో 360 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే ఆయుధం

## 15 కిలోమీటర్ల పరిధిలోని యుద్ధనౌకలు, జలాంతర్గాములను ధ్వంసం చేసే అవకాశం



అమెరికాతో రెండో విడత చర్చలు నిలిచిపోయిన నేపథ్యంలో ఇరాన్ కీలక ప్రకటన చేసింది. అమెరికాకు గుండెపోటు తెప్పించే రహస్య అస్త్రం సిద్ధంగా ఉందని తేల్చిచెప్పింది. దాని గురించి తెలిస్తే శత్రువులు భయకంపితులు కావడం తథ్యమని పేర్కొంది. ఇదొక 'సూపర్ వెపన్'అని ఇరాన్ నేవీ కమాండర్ షహ్రామ్ ఇరానీ తేల్చిచెప్పారు. శత్రువుపై త్వరలోనే ఈ కొత్త అస్త్రం ప్రయోగిస్తామని అన్నారు. రహస్య అస్త్రం ప్రస్తుతం శత్రువు పక్కనే ఉందని వెల్లడించారు. అది చూసి వారి(అమెరికా) గుండె పేలిపోదనే ఆశిస్తున్నట్లు తెలిపారు. ఇరాన్ చెబుతున్న రహస్య ఆయుధం 'హూట్ రాకెట్ టార్పెడో'కావొచ్చని రక్షణ రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇది సముద్ర గర్భంలో తుపాకీ తూటాలాగా శరవేగంగా ప్రయాణిస్తూ శత్రు దేశాల యుద్ధ నౌకలు, జలాంతర్గాములను తుత్తునియలు చేసే ఆయుధం. అనుకూలతలే కాకుండా కొన్ని ప్రతికూలతలు కూడా ఉన్నాయని అంటున్నారు.

### అసలేమిటి హూట్ టార్పెడో?

ఈ ఆయుధాన్ని తొలిసారిగా 2006లో ఇరాన్ రహస్యంగా పరీక్షించింది. అత్యంత వేగంగా ప్రయాణించడం ఈ టార్పెడో ప్రత్యేకత. శత్రుదేశాలు ప్రతిస్పందించేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. దీని గురించి బయటి ప్రపంచానికి అంతగా తెలియదు. హూట్ అంటే పర్షియన్ భాషలో భారీ తిమింగలం. నీటి అడుగున అత్యంత వేగంగా దూసుకెళ్లే ఆయుధాల్లో హూట్ సైతం ఉన్నట్లు ఇరాన్ చెబుతోంది. కానీ, రష్యా వద్ద ఇంతకంటే మెరుగైన సూపర్--కావిటేటింగ్ టార్పెడో ఉంది. ఇది 1990వ దశకంలోనే రష్యా నావికాదళంలోకి ప్రవేశించింది. సంప్రదాయ టార్పెడోల కంటే సూపర్ టార్పెడోలు కొంత భిన్నమైనవి. ఇవి అండర్‌వాటర్ గైడెడ్ క్షిపణుల్లాంటివి. సముద్ర గర్భంలో గంటకు 60 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. కానీ, హూట్ టార్పెడో 360 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లగలదని ఇరాన్ చెప్పుకుంటోంది. అదే నిజమైతే మాత్రం ఇదొక గొప్ప ముందడుగు అవుతుంది. నీరు అత్యంత శక్తివంతమైన నిరోధకం. గాలి కంటే వెయ్యి రెట్లు ఎక్కువ సాంద్రత కలిగి ఉండటం వల్ల నీటి అడుగున ప్రయోగించిన ఆయుధాలు వాటి వేగాన్ని చాలావరకు కోల్పోతాయి. నీటిలో గంటకు 360 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఆయుధాన్ని అభివృద్ధి చేయడం సామాన్యమైన విషయం కాదు. నీటి అడుగున హూట్ చుట్టూ గ్యాస్ బుడగ ఏర్పడుతుంది. అది నీటి నిరోధకతను గణనీయంగా తగ్గిస్తుంది. దాంతో హూట్ వేగంగా ముందుకు సాగుతుంది.

హూట్ రాకెట్ టార్పెడో 200 కిలోలకుపైగా వార్‌హెడ్లను(శక్తివంతమైన పేలుడు పదార్థాలు) మోసుకెళ్లగలదు. హూట్ వేగమే దాని ప్రతికూలతగా చెప్పొచ్చు. అధిక వేగం కారణంగా ఇంధనం అత్యంత వేగంగా దహనమవుతుంది. దీనివల్ల టార్పెడో కేవలం 15 కిలోమీటర్ల పరిధిని కలిగి ఉంటుంది. అంటే ప్రయోగించిన చోటునుంచి 15 కిలోమీటర్ల పరిధిలోని యుద్ధనౌకలు, జలాంతర్గాములను మాత్రమే ధ్వంసం చేయగలదు.

సంప్రదాయ టార్పెడోలు సాధారణంగా 30 కిలోమీటర్ల పరిధిని కలిగి ఉంటాయి. హూట్ అస్త్రాన్ని విజయవంతంగా పరీక్షించారే తప్ప ఏనాడూ యుద్ధక్షేత్రంలో ప్రయోగించలేదు. ఒకవేళ అమెరికా యుద్ధనౌకలు, విమాన వాహన నౌకలు, సబ్‌మెరైన్లను లక్ష్యంగా చేసుకొని ప్రయోగిస్తే ఎంతవరకు ఆశించిన ఫలితాలు వస్తాయో ఇరాన్ సైనికాధికారులు చెప్పలేకపోతున్నారు. ఇలాంటి సూపర్ టార్పెడోల వేగం, శబ్దం చాలా ఎక్కువ. కచి?చతంగా లక్ష్యాన్ని ఛేదించడం కష్టమని అంటున్నారు. అమెరికాకు చెందిన భారీ విమాన వాహక నౌక 'యూఎస్ఎస్ అబ్రహం లింకన్'ప్రస్తుతం ఇరాన్ సమీపంలోనే మోహరించి ఉంది. దీనికి అనేక అంచెల్లో బలమైన రక్షణ వ్యవస్థ ఉంది. హూట్ టార్పెడోతో ఢీకొట్టడం అంత సులువు కాదని అమెరికా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

హూట్ టార్పెడోను సబ్‌మెరైన్లు, నౌకలు, స్పీడ్‌బోట్ల నుంచి ప్రయోగించవచ్చు.

హూట్ రేంజ్ 15 కిలోమీటర్లే కాబట్టి దగ్గరగా వచి?చనప్పుడు శత్రుసైన్యం ముందుగానే కనిపెట్టి ప్రతిదాడి చేసేందుకు ఆస్కారం ఉంది. ఇరాన్ తన హూట్ సూపర్ టార్పెడోను ప్రయోగించగల ఏకైక ప్రదేశం హోర్ముజ్ జలసంధి వంటి పరిమిత జలాల్లో మాత్రమే. ఇరాన్ చేతిలో ఆకస్మిక దాడికి గురవుతామన్న అంచనాతో అమెరికా విమాన వాహక నౌకలు హోర్ముజ్‌కు దూరంగా ఉంటూ, సురక్షితమైన దూరాల నుంచే తమ కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. ఒకవేళ హూట్ టార్పెడో అద్భుతంగా పనిచేసి అమెరికా విమాన వాహక నౌకను తాకితే, అది గణనీయమైన నష్టాన్ని కలిగించగలదు. కానీ, అందుకు అవకాశాలు తక్కువేనని నిపుణులు పేర్కొంటున్నారు.

# సరస్సు అడుగున నగరం!

## కిర్గిస్తాన్‌లో బయటపడ్డ చారిత్రక టోర్ ఐగిర్ ఆనవాళ్లు

## రష్యా పురావస్తు పరిశోధకుల అన్వేషణలో గుర్తింపు

## రాతి దూలాలతో నిర్మించిన కట్టడాలు, సిరామిక్ కళాఖండాలు వెలుగులోకి..



అది కిర్గిస్థాన్‌లోని ఇస్సిక్ కుల్ ఉప్పునీటి సరస్సు. ప్రపంచంలో ఎన్నో చెరువులుండగా దీని గురించే ఎందుకు చెప్పుకోవాలంటే ఆ చెరువు కింద ఓ పురాతన నగరం దాగి ఉంది కాబట్టి! 15వ శతాబ్దంలో సంభవించిన భారీ భూకంపం టోరు ఐగిర్ అనే నగరాన్ని నాశనం చేయగా అనంతర కాలంలో సంభవించిన మార్పులతో అక్కడ ఏర్పడిన ఉప్పునీటి సరస్సు ఆ నగరాన్ని మింగేసింది. అయితే పశ్చిమాసియా దేశాల్లో మధ్యయుగ నివాస ప్రదేశాల గురించి అధ్యయనం చేస్తున్న రష్యా పరిశోధకుల బృందం.. అంతర్ధానమైన సిల్క్‌రూట్ ఆనవాళ్లను వెలికితీయడంతోపాటు 13, 14వ శతాబ్దాల నాటి నెక్రోపోలిస్ సైట్‌ల శోధన మొదలుపెట్టింది. ఈ క్రమంలో రష్యాకు చెందిన అండర్‌వాటర్ ఆర్కియాలాజిస్ట్ మ్యాక్సిమ్ మెన్షికోవ్ ఆధ్వర్యంలోని పరిశోధన బృందం ఇస్సిక్ కుల్ సరస్సు కింద దాగి ఉన్న టోరు ఐగిర్ నగరాన్ని గతేడాది గుర్తించింది.

### క్రీస్తుపూర్వ నగరమిది..

క్రీస్తుపూర్వం ఒకటవ శతాబ్దంలో వర్తక, వాణిజ్యం కోసం సిల్?కరూట్‌లో ఏర్పడిన నగరాల్లో టోరు ఐగిర్ నగరం కూడా ఒకటి. చైనా నుంచి పశి?చమ దేశాలకు ప్రయాణించే వర్తకులకు ఇది మజిలీ నగరంగా ఉండేది. ఈ నగరం ఆనవాళ్లను గుర్తించేందుకు సరస్సు అడుగుకు వెళ్లిన పరిశోధకులకు ఇటుకలతో నిర్మించిన కట్టడాలు, టర్కీ రాజవంశీయుల, ఇస్లామిక్ పాలన ఆనవాళ్లు, ఇస్లాం సంప్రదాయ సమాధులు కనిపించాయి. ధాన్యాన్ని పిండి చేయడానికి ఉపయోగించిన మన తిరగలి వంటి సాధనాలు, చెక్క, రాతి దూలాలతో నిర్మించిన భవనాలు, సిరామిక్ కళాఖండాలు కూడా కంటబడ్డాయి. అక్కడ ఓ మసీదు, స్నానశాల, ఇస్లామిక్ విశ్వవిద్యాలయంతోపాటు చక్కటి ఎక్స్‌టీరియర్‌తో ఒక కమ్యూనిటీ బిల్డింగ్ కూడా ఉంది. అండర్ వాటర్ ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, డ్రోన్ షూటింగ్ ప్రక్రియల ద్వారా నీటి అడుగున ఉన్న నగరం గురించి అండర్‌వాటర్ ఆర్కియాలజిస్టులు ప్రపంచానికి తెలియచేశారు. ఈ ఫొటోలను పరిశీలిస్తే నాటి భవన నిర్మాణంలో కాలి?చన ఇటుకలను ఉపయోగించినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం వాడుకలో ఉన్న ఇటుకలతో పోలిస్తే నాటి ఇటుకలు పరిమాణంలో చాలా పెద్దవి. ఒక్కమాటలో చెప్పాలంటే టోరు ఐగిర్ నగరం క్రీస్తు పూర్వం 1,300 నుంచి 3,300 ఏళ్ల మధ్య విరాజిల్లిన సింధు నాగరకతను గుర్తుచేసింది.

# గురుమూర్తిని సత్కరించిన విక్కుర్తి



అవనిగడ్డ ఆగస్టు 27 శ్రీ వార్త : అవనిగడ్డ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్‌గా విక్కుర్తి శ్రీనివాసరావు నియమితులైన అనంతరం తొలిసారిగా ఆయన నివాసానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తికి విక్కుర్తి శ్రీనివాసరావు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో గురుమూర్తిని సత్కరించి ఆత్మీయంగా అభినందించారు. అనంతరం గురుమూర్తి కూడా అవనిగడ్డ నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్‌గా నియమితులైన విక్కుర్తి శ్రీనివాసరావును శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేస్తూ నియోజకవర్గంలో టీడీపీని మరింత బలోపేతం చేయాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## 59 కోట్లకు చేరిన జన్‌ధన్ ఖాతాలు..

# వీటిల్లో ఎంత డబ్బుందో తెలుసా?

## ఖాతాల్లో రూ.3.17 లక్షల కోట్ల డిపాజిట్లు

## మహిళల పేరిట 56 శాతం ఖాతాలు

## 78 శాతం ఖాతాలు గ్రామీణ ప్రాంతాల్లో

ఢిల్లీ: దేశంలో ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన (పీఎంజేడీవై) ఖాతాల సంఖ్య 59 కోట్లు దాటింది. ఈ ఖాతాల్లో మొత్తం రూ.3.17 లక్షల కోట్ల డిపాజిట్లు ఉన్నాయి. 2014 ఆగస్టు 28న ప్రారంభమైన ఈ పథకం 12 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ వివరాలను వెల్లడించింది. జన్‌ధన్ ఖాతాల్లో 78 శాతం గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లోనే ఉన్నాయి. సుమారు 56 శాతం ఖాతాలు మహిళల పేరిట ఉన్నాయి. పేదలు, మారుమూల ప్రాంతాల ప్రజలను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం. 2026 ఆగస్టు 19 నాటికి ఒక్కో ఖాతాలో సగటున రూ.5,356 ఉన్నాయి. గత 12 ఏళ్లలో ఒక్కో ఖాతాకు సగటు డిపాజిట్ 3.4 రెట్లు పెరిగింది. ఖాతాలను ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నారని, పొదుపు అలవాటు పెరిగిందని ఇది సూచిస్తోందని ఆర్థిక శాఖ తెలిపింది. జన్‌ధన్ ఖాతాదారులకు ఉచిత రూపే డెబిట్ కార్డు లభిస్తుంది. దీనితో రూ.2 లక్షల ప్రమాద బీమా ఉంటుంది. అత్యవసర సమయంలో రూ.10 వేల వరకు ఓవర్‌డ్రాఫ్ట్ సదుపాయం కూడా ఉంది. జన్‌ధన్-ఆధార్-మొబైల్ (జేఏఎం) వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదు నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి చేరుతోంది. మధ్యవర్తులు, జాప్యానికి అవకాశం లేకుండా ఆర్థిక సాయం అందుతోందని కేంద్రం తెలిపింది.

# స్థానిక ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలి, ఇంటింటి ప్రచారాన్ని మరింత విస్తృతం చేయాలి

### టీడీపీ శ్రేణులకు జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ పిలుపు



మచిలీపట్నం శ్రీవార్త న్యూస్ : మచిలీపట్నం పార్లమెంట్ టీడీపీ కార్యాలయంలో బుధవారం జరిగిన కృష్ణా జిల్లా టీడీపీ క్యాలెండర్ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు కొనసాగుతున్న ఇంటింటి ప్రచారాన్ని మరింత విస్తృతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్, క్లస్టర్ పరిధిలో నాయకులు, కార్యకర్తలు ప్రజలను నేరుగా కలిసి సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని, గ్రామ, మండల స్థాయిలో పార్టీని బలోపేతం చేసుకుని నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయంతో ముందుకు సాగాలని అన్నారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తూ స్థానిక ఎన్నికల్లో టీడీపీ ఘన విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్, టీడీపీ జాతీయ కోశాధికారి కొనకళ్ల నారాయణరావు, గౌడ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్, జిల్లా అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి, జాతీయ ఉపాధ్యక్షులు వై.వి.బి.రాజేంద్ర ప్రసాద్, బూరగడ్డ వేదవ్యాస్ తదితరులు పాల్గొన్నారు.



